
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 266 ISSUE NO : 266 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, ఏప్రిల్, 19, 2026 Sunday, April, 19, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|



## బుధవారమే డెడ్‌లైన్..

ఒప్పందం కుదరకుంటే

# మళ్లీ బాంబులే

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. వచ్చే బుధవారం లోపు ఒప్పందం ఖరారు కాకపోతే ఇరాన్‌పై మళ్లీ బాంబు దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ట్రంప్ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది. హమాస్, హిజ్బుల్లా వంటి సంస్థలకు నిధులు ఆపడానికి, అణు కార్యక్రమాన్ని నిరవధికంగా నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని శుద్ధిచేసిన యురేనియం నిల్వలను కూడా అమెరికాకు తరలించడానికి ఒప్పుకుందని ఆయన ప్రకటించారు. ఒప్పందం పూర్తయ్యే వరకు ఇరాన్‌పై నావికాదళ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు.

న్యూఢిల్లీ, : కేంద్ర మంత్రులు కుమార స్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు.



## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్

# ఏర్పాటు

కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్

ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

దేశంలోని మహిళలందరికీ..

# క్షమాపణలు

### జాతినుద్దేశించి ప్రసంగంలో ప్రధాని మోదీ ఎమోషనల్

### మహిళలను ఎదగనీయకుండా విపక్షాలు అడ్డుకున్నాయని ఫైర్



డిల్లీ: శుక్రవారం రోజున లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన నేపథ్యంలో.. తాజాగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దేశంలోని మహిళలకు సంబంధించిన ముఖ్యమైన విషయాన్ని చర్చించేందుకు తాను ఈ ప్రసంగం చేస్తున్నట్లు వివరించారు. దేశంలో మహిళల పురోగతిని ఎలా అడ్డుకున్నారో ప్రతీ పౌరుడు చూస్తున్నారని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం తాము ఎంతగానో ప్రయత్నించినప్పటికీ.. విజయం సాధించలేకపోయామని వెల్లడించారు. నారీ శక్తి అధినియమ్‌లో సవరణలు చేయలేకపోయామని.. అందుకు దేశంలోని తల్లులందరికీ తాను క్షమాపణలు చెబుతున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.



## మహిళా బిల్లు పేరుతో..

# డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై, : మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు.



### మహిళా రిజర్వేషన్ల ముసుగులో డీలిమిటేషన్ బిల్లు

## మంత్రి సీతక్క ఫైర్

హైదరాబాద్,తెలంగాణ దిశ: కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతూ దేశ ప్రతిష్టను మసకబారుస్తోందని మంత్రి సీతక్క మండిపడ్డారు. అమెరికాకు ప్రణవిల్లుతూ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన బీజేపీ సర్కార్.. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మహిళా రిజర్వేషన్ డ్రామా ఆడుతోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో డిలిమిటేషన్ బిల్లును తీసుకురావడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనిఆమె ధ్వజమెత్తారు. ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణ ప్రకారం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.పన్నెండు ఏళ్ల అధికారంలో ఉండి కూడా మహిళా బిల్లు విషయంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని సీతక్క ప్రశ్నించారు.






## మహిళలకు విపక్షాలు

# వ్యతిరేకం

- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినెట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ,ఏప్రిల్18 : మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు.





## వరంగల్ విమానాశ్రయానికి

# త్వరలో శంకుస్థాపన

## పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ దిశ : వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి,ఇతర అధికారులతో విమానాశ్రయాల ఏర్పాటుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు.



## పవన్ కల్యాణ్‌కు..

# తీవ్ర అస్వస్థత

## హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స

హైదరాబాద్ ,తెలంగాణ దిశ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం ఉదయం అధికారులతో సమావేశంలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత వైద్యుల సూచన మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను కూడా పవన్ కల్యాణ్ రద్దు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలతో పాటు ఎంఆర్ఐ కూడా నిర్వహించారు. రిపోర్టులను సమీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించి విజయవంతంగా పూర్తి చేశారు. వారం నుంచి పది రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత పవన్ కల్యాణ్ తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన పూర్తిస్థాయిలో కోలుకోవడానికి గణనీయమైన సమయం పడుతుందని, దీర్ఘకాలికంగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వివరాలను జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.



# మీ సూచనలు భేష్..

## సీఎం రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అభినందనలు

హైదరాబాద్,తెలంగాణ దిశ : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రతిపాదనల విషయంలో బీజేపీ విధానంలోని లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నుంచి ప్రశంసలు అందాయి. ఢిల్లీలో ప్రియాంక గాంధీని శనివారం ఉదయం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం.. దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరఫున ప్రియాంక గాంధీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఏకగ్రీవంగా ఆమోదం పొందిన మహిళా బిల్లుతో సంబంధం లేకుండా, మహిళా సాధికారత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనవసరమైన డీలిమిటేషన్ అజెండాను ముందుకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సీఎంతో అన్నారు.

# జిల్లాలో అక్రమ క్లినిక్‌లపై కఠిన చర్యలు

## - అనధికార వైద్య సేవలపై అధికారుల సీజ్
## - ప్రజల ఆరోగ్యంపై ఆందోళన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :జిల్లాలో వైద్య రంగంలో జరుగుతున్న ఉల్లంఘనలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుంది. సఫిల్‌గూడ, ఉత్తమ్‌నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న శ్రీ వెంకటేశ్వర వెల్‌నెస్ సెంటర్ పై నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. ఈ కేంద్రం గతంలో శ్రీ వెంకటేశ్వర స్కిన్, హెయిర్ అండ్ కాస్మెటాలజీ క్లినిక్ పేరిట నమోదు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తూ 2024 సెప్టెంబర్ 2న సీజ్ చేయబడిన విషయం తెలిసిందే. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, అలోపతి చట్టం--2010కు వ్యతిరేకంగా పనిచేయడం, తప్పుడు పత్రాలు సమర్పించడం వంటి ఆరోపణలు అప్పట్లో నమోదయ్యాయి. అయితే అదే యాజమాన్యం శ్రీ వెంకటేశ్వర వెల్‌నెస్ సెంటర్ పేరుతో మళ్లీ రిజిస్ట్రేషన్ పొందినప్పటికీ, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ డాక్టర్ ఉమాగౌరీ ఆధ్వర్యంలో నిర్వహించిన తాజా తనిఖీల్లో మరింత తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. తనిఖీల్లో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సుజితకు తగిన వైద్య అర్హతలు లేకపోయినా బోటాక్స్, పిఆర్ పి, లేజర్ హెయిర్ రిమూవల్, ఫిల్లర్స్, థ్రెడ్ లిఫ్ట్స్, మెసోథెరపీ వంటి సున్నితమైన వైద్య ప్రక్రియలను అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇవి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని అధికారులు స్పష్టం చేశారు. పేషెంట్ల నుండి ఒక్కో సిట్టింగ్‌కు రూ.18,000 వరకు వసూలు చేస్తూ, ప్యాకేజీల రూపంలో భారీ మొత్తాలను ముందుగానే తీసుకుంటున్నట్లు బాధితులు తెలిపారు. ఇది వైద్య నైతికతకు విరుద్ధమేకాకుండా ఆర్థిక దోపిడీగా అధికారులు అభివర్ణించారు. ఈ చర్యలు నేషనల్ మెడికల్ కమిషన్ చట్టంలోని సెక్షన్లు 20, 22, 34, 54లకు వ్యతిరేకంగా ఉండటంతో ఆ కేంద్రాన్ని తక్షణమే సీజ్ చేశారు. ఇదే సమయంలో ఏఎస్ రావు నగర్‌లోని ట్రైకోవియా హెయిర్, స్కిన్ అండ్ లేజర్ క్లినిక్ పై తనిఖీల్లో డాక్టర్ నాజియా పేరుతో నడుస్తున్న ఈ కేంద్రంలో డాక్టర్ ప్రణవి (బిడిఎస్) అనధికారికంగా స్కిన్, ఫేస్ సంబంధిత వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. అవసరమైన అర్హతలు లేకపోవడంతో ఆ క్లినిక్‌ను కూడా



సీజ్ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి ఉమాగౌరీ మాట్లాడుతూ కేవలం రిజిస్ట్రేషన్ ఉంటే సరిపోదు. ప్రతి వైద్య సేవలు తగిన అర్హతలు కలిగిన వైద్యులచే, చట్టబద్ధ నిబంధనల ప్రకారం మాత్రమే అందించాలి. ఉల్లంఘనలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.5 లక్షల ఆర్థిక సహాయం అందజేత



**మల్లాపూర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 2.5 లక్షల ఎల్ఓసీ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఈ సహాయం అందించబడిందన్నారు. మల్లాపూర్ డివిజన్ ఎస్ వి నగర్ కాలనీకి చెందిన సంగీత నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారికి మంజూరైన రూ. 2.5 లక్షల ఆర్థిక సహాయాన్ని వారి కుమారుడు సుబ్బుకు అందజేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన ఈ సహాయం బాధిత కుటుంబానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. సంగీత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టకాలంలో అండగా నిలబడటం తమ బాధ్యత అని, బాధితుల పక్షాన నిలిచి సేవ చేయడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సేవాభావంతో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు.

# కేపీహెచ్‌బీ వద్ద అర్ధరాత్రి బస్సుకు అగ్నిప్రమాదం








## - డ్రైవర్ అప్రమత్తతతో బయటపడిన ప్రయాణికులు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** : నగరంలోని కేపీహెచ్‌బీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గచ్చిబౌలి నుంచి బయలుదేరిన శ్రీ దుర్గ మల్లేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు (నంబర్: ఎన్ ఎల్ 02 బి 9955) ప్రయాణ మధ్యలో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. శనివారం తెల్లవారుజామున సుమారు 2:30 నుంచి 3:00 గంటల మధ్య మెట్రో పిల్లర్ నంబర్ ఏ-734 సమీపంలో ఈ ఘటన జరిగింది. బస్సులో మంటలు ప్రారంభమైనట్లు గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని ఆపి, అందులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు దింపాడు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తప్పింది. ప్రయాణికులు దిగిన కొద్దిసేపటికే బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకుని ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా యాంత్రిక లోపం కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అసలు కారణం దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రైవేట్ రవాణా వాహనాలకు నిరంతర నిర్వహణ, భద్రతా తనిఖీలు తప్పనిసరిగా చేయాలని అధికారులు మరోసారి సూచించారు.

# తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

## - బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై ఆగ్రహం



**కీసర, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తక్కువ చేసి మాట్లాడడం అనేది ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. బీజేపీ దురహంకార ప్రాంతీయ విబేధ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. అలాగే, తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం అనేది పాలక వర్గాల కరుణ వల్ల ఏర్పడినది కాదని, ఇది విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు, ఉద్యోగులు చేసిన దీర్ఘకాలిక పోరాటాల ఫలితమని ఆయన స్పష్టం చేశారు. వేలాది మంది యువత ప్రాణ త్యాగాలతో సాధించిన ఈ రాష్ట్రాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను భవిష్యత్తులో సహించబోమని హెచ్చరిస్తూ, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# వినోబాజీ సేకరించిన ప్రతి గజం భూమి పేదలకే చెందాలి : డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి



**హయత్ నగర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** : ఆచార్య వినోబా భావే ప్రారంభించిన భూదాన్ ఉద్యమానికి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కుంట్లూర్‌లోని గాంధీయన్ బీఈడీ కళాశాల ఆవరణలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, వినోబా నగర్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భూదాన్ బోర్డు మాజీ చైర్మన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేదల కోసం వినోబా భావే దేశ వ్యాప్తంగా పాదయాత్రలు చేసి సుమారు 45 లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు పంచారని తెలిపారు. అహింసా మార్గంలో సమాజ మార్పు సాధ్యమని నిరూపించిన మహానుభావుడని కొనియాడారు. వినోబా ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి ముందు వినోబా భావే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. "వినోబా సేకరించిన ప్రతి గజం భూమి పేదలకే చెందాలి, భూమి లేని మనిషి ఉండకూడదు" అంటూ నినాదాలు చేశారు. అనంతరం భూదాన్ భూములన్నీ నిజంగా పేదలకు చేరేలా కృషి చేయాలని ప్రతి పౌరుడు కంకణం కట్టాలని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి, గోలి నరసింహ, రాష్ట్ర గురుకులాల పేరెంట్స్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కృష్ణయ్య, డాక్టర్ ఏళ్ల ప్రేమ్ కుమార్, పల్లె శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి సుధాకర్, సతీష్ కుమార్, పవన్, అనిల్, హరీష్, కుమారి యానాల చైత్రిక తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌యూజె(ఐ) జాతీయ స్థాయి జర్నలిస్టుల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ





**మెట్‌పల్లి, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ నివాసంలో ఎన్‌యూజజె(ఐ) జాతీయ స్థాయి జర్నలిస్టుల మహాసభల పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి శనివారం ఆవిష్కరించారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజెఐ) అనుబంధంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జెయూ) ఆధ్వర్యంలో ఈ మహాసభలు ఏప్రిల్ 23, 24 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా మైలారపు లింబాద్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి జర్నలిస్టులు పాల్గొని హైదరాబాద్ వేదికగా




మహాసభలను నిర్వహించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న టీఎస్‌జెయూ కార్యవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు దీకొండ మురళి, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ గట్ల శ్రీనివాస్, సభ్యులు గట్ల సునీల్, సజ్జనపు శ్రవణ్, కాంగ్రెస్ యువ నాయకులు మైలారపు రాంబాబు, ఎన్ఎస్‌యూఐ నాయకులు దోమకొండ రమేష్, చాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి గేదెల పథకానికి దరఖాస్తుల గడువు ఏప్రిల్ 23 వరకు పొడిగింపు



**మేడ్చల్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో పేద కుటుంబాలకు సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎస్సీ, యాక్షన్ ప్లాన్ 2025--26లో భాగమైన పాడి గేదెల పథకానికి దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. మొదటగా ఈ నెల 8 నుండి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, మరింత మందికి అవకాశం కల్పించేందుకు గడువును ఏప్రిల్ 23, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక్కో యూనిట్‌కు రూ. 10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించి, పేద దళిత కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులను సంబంధిత డిప్యూటీ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ స్థాయిలో పరిశీలించి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. ఈ ప్రకటనను ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారులు విడుదల చేశారు.

# భౌరంపేట్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

## - ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలకు విశేష స్పందన




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :ఆర్ఎస్ఎస్ స్థాపనకు వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శతాబ్ది వేడుకలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్‌లో శనివారం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా యోగధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు శ్రీ ఉదయ్ మహారాజ్ స్వామీజీ పాల్గొని ధార్మిక విలువలు, సంస్కృతి పరిరక్షణపై ఉపన్యాసం ఇచ్చారు. మహిళా




వక్తగా రాష్ట్ర సేవికా సమితికి చెందిన ఉషా ముదిగొండ హాజరై యువతలో దేశభక్తి, సేవా భావం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ ప్రచారకులు శ్రీ గాజుల శివశంకర్ పాల్గొని హిందూ సమాజ ఐక్యతపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. కార్యక్రమం సందర్భంగా భజనలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానిక యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామంలోని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు ఏకమై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయడం విశేషంగా నిలిచింది.

# ఏఎస్ రావునగర్‌లో ఉచిత సమ్మర్ స్కేటింగ్ క్లాసులు



**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :ఈసీఐఎల్, ఏఎస్ రావునగర్ పరిసర ప్రాంతాల్లోని పిల్లల కోసం వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఉచిత స్కేటింగ్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కోచ్ కన్నా గౌడ్ తెలిపారు. ఏఎస్ రావునగర్ హుడా పార్క్‌లోని స్కేటింగ్ గ్రౌండ్‌లో ఈ తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. ఎండాకాలంలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లలు ఏదైనా శారీరక కార్యకలాపాలలో పాల్గొనడం అవసరమని, ఈ స్కేటింగ్ క్లాసులు మంచి అవకాశం అని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం 9949743152 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# జాతీయస్థాయి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**మెట్‌పల్లి, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజెఐ) అనుబంధంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జెయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి మహాసభల పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ మహాసభలు ఈ నెల 23, 24 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా మెట్‌పల్లి ఆర్డీఓ నర్సింహా రావు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి జర్నలిస్టులు పాల్గొనే ఈ మహాసభలు జర్నలిస్టుల ఐక్యతకు, సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ మహాసభలను నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు దీకొండ మురళి, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ గట్ల శ్రీనివాస్, సభ్యులు గుండవేని రమేష్, గట్ల సునీల్, సజ్జనపు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్ బిగ్ డీల్..!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచంలో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు మాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్?యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. ఇది ఉమ్మడి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తూ, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్?ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇప్పుడు అమెరికా కుళ్లుకుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా?ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించార. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య పోటీతత్వాన్ని, భౌగోళిక రాజకీయాల ప్రభావాన్ని సూచిస్తోంది. ఈ ఒప్పందం ఈయూ? భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు. అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మొత్తంగా, ఈ డెవలప్‌మెంట్ భారత్ గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది, ఇతర దేశాలు కూడా భారత్‌వైపు చూసేలా చేస్తుంది. మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20?30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి. ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు. ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. యూరప్ నుంచి టెక్నాలజీ, మెషినరీ దిగుమతులు పెరిగి, భారత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. భారత్ నుంచి ఐటీ, ఆటో పార్ట్స్ ఎగుమతులు పెరిగి, సరఫరా బలపడుతుంది. అయితే, స్థానిక ఉత్పాదకులు పోటీకి సిద్ధంగా ఉండాలి. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం గురించి అందరికీ తెలిసిందే. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు భారత ప్రధాని మోదీతో మంచి స్నేహ సంబంధాలను నెరిపారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ట్రంప్ అసలు స్వరూపం బయటకు రావడం మొదలైంది. ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. భారత్ ఖండించినప్పటికీ అమెరికా అధ్యక్షుడి తీరు మారలేదు. అంతే కాదు పాకిస్థాన్‌తో దోస్తీ చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు ట్రంప్. అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ మాట వినకపోతే భారత్‌కు భవిష్యత్తు లేదనేది ట్రంప్ మాటల ఉద్దేశంగత ఏడాది యూకేతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న భారత్.. న్యూజిలాండ్‌తోనూ ట్రేడ్ డీల్ చేసుకుంది. ఒమన్‌తో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు యూరోపియన్ యూనియన్‌తో ఏకంగా మదర్ ఆఫ్ డీల్స్‌గా చెప్పుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రేలియా, కెనడా, చిలీ లాంటి దేశాలతోనూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి భారత్ చర్చలు జరుపుతోంది. తద్వారా అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్లు లభించడంతోపాటు.. మనకు అవసరమైన వనరులను ఈ దేశాల నుంచి పొందడానికి అవకాశం కలగనుంది. ట్రంప్ వైఖరి వల్ల భారత్‌తోపాటు యూరప్ దేశాలు సైతం విసిగిపోయాయి. అమెరికా పొరుగు ఉన్న కెనడాకు సైతం అగ్రరాజ్యం తీరు ఏమాత్రం నచ్చడం లేదు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలబెడతామని టారిఫ్ వార్ మొదలుపెట్టిన ట్రంప్.. ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో అమెరికా తీరుతో విసిగిపోయిన దేశాలు.. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా వేగంగా అడుగులేస్తున్నాయి.

# జిల్లాలో డయాలసిస్ సేవల విస్తరణకు స్థలాల తనిఖీలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపాదిత డయాలసిస్ కేంద్రాలు ఇప్పటికే ఉన్న కేంద్రాల్లో అదనపు పడకల ఏర్పాటుపై జిల్లా వారీగా సమగ్ర చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా సంబంధిత కేంద్రాల్లో స్థల స్థాయి తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి, జిల్లా కో ఆర్డినేటర్ (హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ సునీత, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధ కలిసి సిహెచ్‌సి ఘట్‌కేసర్, సిహెచ్‌సి శామీర్‌పేట్ కేంద్రాలను సందర్శించి డయాలసిస్ సేవల విస్తరణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మానవ వనరుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇన్-హౌస్ మెడికల్ ఆఫీసర్, ఫిజీషియన్, అనస్తీషియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారా అనే విషయంతో పాటు ఐ హెచ్ఎఫ్ఎంఎస్ సిబ్బంది, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ప్రొవైడర్లు, శానిటేషన్ సిబ్బంది, ప్రతి షిఫ్ట్‌కు తగిన సంఖ్యలో ఉన్నారో లేదో సమీక్షించారు. మౌలిక సదుపాయాల పరంగా ప్రతి డయాలసిస్ పడకకు 80--100 చదరపు అడుగుల స్థలం, సపోర్ట్ సర్వీసులకు 150--180 చదరపు అడుగుల విస్తీర్ణం, 5 పడకల యూనిట్‌కు సుమారు 1200--1400 చదరపు అడుగుల స్థలం అవసరమని అధికారులు పరిశీలించారు. అదేవిధంగా హెచ్ బీవీ, హెచ్ సీవీ, హెచ్ ఐవీ వంటి అంటు వ్యాధుల రోగుల కోసం ప్రత్యేక విభాగం, రోగులు, వారి సహాయకుల కోసం వేచి ఉండే చోటు వంటి సదుపాయాలను కూడా తనిఖీ చేశారు. అత్యవసర, సాంకేతిక సదుపాయాల కింద ఆక్సిజన్ వంటి ఎమర్జెన్సీ పరికరాలు, ల్యాబొరేటరీ, టీ-డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు, తాగునీరు, నీటి కనెక్షన్, నిరంతర విద్యుత్ సరఫరా, అలాగే ఐటీ, టెలీ-మానిటరింగ్ కోసం ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను సమీక్షించారు. అదనంగా,



కేంద్రాలు తక్షణ సేవల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయా, అవసరమైన మానవ వనరుల నియామకానికి పట్టే సమయం, సివిల్ వర్క్స్ అవసరాలు (చిన్న, పెద్ద మరమ్మత్తులు), ప్రస్తుత స్థితి మరియు పనులు పూర్తి చేయడానికి అవసరమైన కాలపరిమితి వంటి అంశాలను సమగ్రంగా అంచనా వేశారు. తనిఖీల అనంతరం సంబంధిత నివేదికలను నిర్దేశిత నమూనాలో సిద్ధం చేసి పై అధికారులకు సమర్పించనున్నారు. జిల్లాలో డయాలసిస్ సేవలను మరింత బలోపేతం చేసి, ప్రతి రోగికి సమీపంలోనే నాణ్యమైన, సురక్షిత వైద్య సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# ఏఎస్ రావునగర్‌లో ట్రైకోవియా హెయిర్, స్కిన్ అండ్ లేజర్ క్లినిక్ సీజ్



**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్‌లోని ట్రైకోవియా హెయిర్, స్కిన్ అండ్ లేజర్ క్లినిక్ ను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సి ఉమా గౌరీ సీజ్ చేశారు. జిల్లాలో వైద్య రంగంలో జరుగుతున్న తీవ్రమైన ఉల్లంఘనలపై జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుంది. ఇందులో భాగంగా పలు ఆస్పత్రులు, క్లినిక్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఆందోళనకర అంశాలను వెలుగులోకి తీసుకువచ్చాయి. ఏఎస్ రావునగర్ లో డాక్టర్ నాజియా పేరుతో నడుస్తున్న ఈ కేంద్రంలో డాక్టర్ ప్రణవి (బిడియస్) స్కిన్, ఫేస్ సంబంధిత వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఆమెకు ఆ సేవలు నిర్వహించడానికి అవసరమైన అర్హతలు లేకపోవడంతో ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. జిల్లా



వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరీ మాట్లాడుతూ కేవలం రిజిస్ట్రేషన్ ఉంటే సరిపోదన్నారు. ప్రతి వైద్య సేవలు తగిన అర్హతలు కలిగిన వైద్యులచే, చట్టబద్ధ నిబంధనల ప్రకారం మాత్రమే అందించాలన్నారు. ఉల్లంఘనలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ఈ చర్యలు నేషనల్ మెడికల్ కమిషన్ చట్టంలోని సెక్షన్లు 20, 22, 34, 54కు వ్యతిరేకంగా ఉండటంతో పాటు ప్రజల ఆరోగ్య భద్రతను తీవ్రంగా ప్రమాదంలోకి నెట్టుతున్నాయని నిర్ధారించి, ఆ కేంద్రాన్ని వెంటనే సీజ్ చేసారు.

# పాఠశాలలో సదుపాయాలు మెరుగు పర్చాలి

### - కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18 (తెలంగాణ దిశ):షామీర్ పేట్ మండలంలోని తూముకుంట జడ్ పీహెచ్ఎస్ పాఠశాలను శనివారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రైమరీతో పాటు హైస్కూల్ కూడా ఉండటంతో విద్యార్థులకు అవసరమైన కనీస సదుపాయాలు ప్రాధాన్యతగా కల్పించాలని సూచించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు అవసరమని ప్రిన్సిపల్ వినతి పెట్టగా, ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్, నీటి సమస్యపై కూడా స్పందించారు. మున్సిపల్ నీరు సరిపోవడం లేదని ప్రిన్సిపల్ తెలియజేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి బోర్ వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అత్యవసర మరమ్మత్తులు ముందుగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయ్ కుమారి, షామీర్ పేట్ తహసీల్దార్ సుచరిత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మల్లన్న పోరాటంతోనే కులగణన రిపోర్ట్ విడుదల: పనగట్ల చక్రపాణి గౌడ్

### - సైనిక్ పురి చౌరస్తాలో తీన్మార్ మల్లన్న చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం

### - బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం: టీఆర్‌పీ జిల్లా అధ్యక్షులు




**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే రిపోర్టును విడుదల చేయడం పట్ల తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా శనివారం సైనిక్ పురి చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన జరగడం వెనుక తీన్మార్ మల్లన్న గారి నిరంతర పోరాటం ఉందని కొనియాడారు. "ప్రభుత్వం కులగణన చేసినప్పటికీ, ఆ లెక్కలను బయటపెట్టకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటు.



ఎమ్మెల్సీగా మల్లన్న గారు శాసన మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, వివిధ మాధ్యమాల ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయడం వల్లే నేడు ఈ రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చింది. ఇది మల్లన్న గారి పట్టుదలకు, ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం," అని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మల్లన్న నాయకత్వంలో రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్‌యూజెఐ జాతీయ స్థాయి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

### - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శనివారం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజెఐ) అనుబంధంగా ఉన్న తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జెయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏప్రిల్ 23, 24 తేదీలలో హైదరాబాద్ వేదికగా ఈ మహాసభలు జరగనున్న సందర్భంగా ఎమ్మెల్యే పోస్టర్‌ను విడుదల చేసి నిర్వాహకులను అభినందించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి జర్నలిస్టులు పాల్గొనే ఈ మహాసభలను హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వృత్తి పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై చర్చలు జరగడం అవసరమని తెలిపారు. మహాసభల నిర్వహణకు కృషి చేస్తున్న తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరి హరికృష్ణ, వరంగల్ జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు ఈద శ్రీనాద్, మాడ సదానందం, వేణు తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల అభివృద్ధితో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం

### - ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18, (తెలంగాణ దిశ)** :జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి, ప్రగతి నగర్ లోని కాకతీయ నగర్ తో పాటు ప్రశాంతి గోల్డెన్ హిల్స్ ప్రాంతాలలో పర్యటించి సర్వేపల్లి రాధా కృష్ణన్ పార్కు, ఐలమ్మ పార్కు, కెప్టెన్ ఉన్ని కృష్ణన్ పార్కు లను శనివారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సందర్శిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవా సులకు వ్యాయా మంతోపాటు పిల్లల ఆట విడుపు కోసం ఏర్పాటుచేసిన కాలనీలలోని పార్కులను అభివృద్ధి పరచడం, కాలనీలోని రోడ్లు, భూగర్భ డ్రైనేజీ మరమ్మత్తు పనులతో త్వరిత గతిన పూర్తిచేయడంతో పాటు త్రాగునీటి సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను అదేశించా రు. కాలనీలోని సమస్యలను అన్నింటిని అభివృద్ధి పరచడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఉప కమిషనర్ సాబెర్ అలీ, వివిధ విభాగాల అధికారులు, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు గాజుల సుజాత, నాయకులు అజయ్ చౌదరి, సాంబశివ రెడ్డి, క్రిష్ణ మంజరి తదితరులు పాల్గొన్నారు.



# భూభారతిలోనూ...అవే లోపాలు!

**హైదరాబాద్(తెలంగాణ దిశ):** బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ఒక ప్రధాన కారణమైన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్ది, పారదర్శ కమైన భూ రికార్డుల నిర్వహణ కోసం ప్రస్తుత ప్రభుత్వం భూభారతి ని ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చింది. అయితే, ఆచరణలో ఈ కొత్త వ్యవస్థ కూడా పాత రోగాలనే ప్రదర్శిస్తుండటం ఇప్పుడు రైతాం గాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల జనగామ, యాదాద్రి జిల్లాల్లో వెలుగుచూసిన చలాన్ల కుంభకోణం ఈ వ్యవస్థలోని సాంకే తిక లొసుగులను బట్టబయలు చేసింది. పేరు మార్చారు కానీ, అక్రమార్కులు చొరబడే మార్గాలను మాత్రం మూసివేయలేకపో యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# వేసవిలో ఆరోగ్యం కోసం







ఏడాది పొడవునా వివిధ కాలాల్లో పండ్లు, ఫలాలను ప్రకృతి మనకు అందించింది. వేసవిలో లభించే రకరకాల పండ్లు కూడా మనకెంతో మేలు చేస్తాయి. వాతావరణంలోని అధిక ఉష్ణోగ్రతలకు శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటం, జీర్ణ సంబంధిత సమస్యల్ని దూరం చేయటం.. ఇలా పలు రకాలుగా ఇవి మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈకాలంలో లభించే పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటే ఎంతోకొంత ఉపశమనం పొందొచ్చు. పండ్లుగా తినటమే కాకుండా రసాలు (జ్యూసులు)గా కూడా వీటిని తీసుకుంటే చక్కటి ఆరోగ్యం సొంతమవుతుంది. బొప్పాయి, జామ, ఆపిల్, ద్రాక్ష, మామిడి, పుచ్చకాయ వంటివి మార్కెట్లో ప్రస్తుతం విరివిగా దొరుకుతున్నాయి. పండ్లలో బెటాకెరోటీన్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్–సి, పొటాషియం, విటమిన్–బి కలిగివుండటం వల్ల శరీరానికి కావాల్సిన వ్యాధి నిరోధక శక్తి సమకూరుతుంది. మంచి ఆరోగ్యానికి కూడా ఇవి దోహదపడతాయి. పుల్లని నిమ్మ, నారింజ పండ్లలో విటమిన్–సి అధికంగా ఉంటుంది. పండ్లుగానూ, జ్యూస్‌లుగానూ కూడా వీటిని తీసుకోవచ్చు. జ్యూస్ కన్నా పండ్లను నేరుగా తీసుకోవటం మంచిది. పండ్లలో ఎక్కువశాతం విటమిన్లు, మినరల్స్, ఫైబర్లు, ఫ్లావానోయిడ్స్ ఉంటాయి. జ్యూస్ చేసేటప్పుడు తొక్కను తీసేస్తుంటాం. అలాంటపవిడు వాటిలో ఉండే ఫైబర్, మినరల్స్, విటమిన్స్ తగ్గిపోతాయి. పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్, ఫాయిటో స్టేరోల్స్, ఫ్లావనోయిడ్స్ వంటివి శరీర ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. అదే జ్యూస్ అయితే ఈ ఫాయిటోకెమికల్స్ పండ్ల తొక్కలోనే ఉండిపోతాయి.

కొబ్బరి బోండాం : సమ్మర్‌లో మరో హెల్దీ డ్రింక్‌గా కొబ్బరి బోండాంను చెబు తుంటారు. వేసవి తాపాన్ని తట్టుకోవటానికి రోజుకు ఒక గ్లాస్ కొబ్బరినీటిని తీసుకుంటే మంచిది. దీనివల్ల అందులోని ఎలక్ట్రోలైట్స్ మన శరీరానికి అందుతాయి. కివీ : పోషకాలు ఎక్కువగా నిక్షిప్తమే ఎండా కాలంలో లభ్యమయ్యే మరో పండు కివీ. ఇందులో అధికంగా ఉండే విటమిన్లు సి, ఇ, పొటాషియం, ఫైబర్ వంటివి శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఆప్రికాట్ : పొటాషియం, ఐరన్, బీటా కెరోటిన్,ఫైబర్‌తోపాటు విటమిన్ సి వంటి పోషకాలు అధికంగా లభించే మరో పండు ఆప్రికాట్. ఎండు ఆప్రికాట్ శరీరంలో ద్రవాల స్థాయిలు తగ్గకుండా చేయడంతోపాటుగా మలబద్దకం వంటి పలు జీర్ణ సంబంధిత సమస్యల్ని తగ్గించటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. జ్వరం, రక్తహీనత, చర్మ సమస్యలు మొదలైనవి దరిచేరకుండా కాపాడుతుంది. కర్బూజా : నీటిశాతం అధికంగా ఉండే పండ్లలో కర్బూజా ముఖ్యమై నవి. దీన్ని తినడం వల్ల ఇందులో ఎక్కువగా ఉండే నీరు శరీరంలోకి చేరి..చెమట రూపంలో కోల్పోయిన నీటిశాతాన్ని తిరిగి భర్తీ చేస్తుంది. ఈ పండు రక్తపోటుని అదుపులో ఉంచటంతోపాటు ఆస్తమా దరి చేరకుండా కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. చెరకు రసం చెరకును ముక్కలుగా కట్ చేసి నమలొచ్చు. మిషన్ ద్వారా చెరకు రసం కూడా తీసితాగొచ్చు. దీనినితీసుకోవటం వల్లతక్షణశక్తి లభిస్తుం ది. వేడికారణంగా అలసిన శరీరానికి దీనివల్ల ఉపశమనం లభిస్తుంది. చెరకు రసాన్ని కూడా బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా చెబుతారు. మ్యాంగో లస్సీ : ఇప్పుడిప్పుడే మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేస్తున్నా యి.పండిన రసంకాయల నుంచి రసాన్నితీసి లస్సీలాకూడా తాగేయొ చ్చు. ఇది నార్మల్ లస్సీ కంటే కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. పెరుగు కూడా కలుపుకోవచ్చు.ఈ రెండింటి కలయిక అద్భుతంగా ఉంటుంది. అనాస : జీర్ణశక్తిని పెంచడానికి ఉపయోగపడే అద్భుతమైన పండు అనాస. వీటిలోఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ కారణం. ఎన్నో రకాల ఖనిజాలు, విటమిన్లు దాగున్నాయి. వీటిలో ఎక్కువమొత్తంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంపలు వ్యాధులబారినపడకుండా కాపాడతాయి. ఇవే కాకుండా బ్లూ బ్రెర్రీ, బ్లాక్ బెర్రీ, స్ట్రా బెర్రీ వంటి పండ్లలో ఫైటో కెమికల్స్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక శక్తిని మెరుగుపర్చడానికి తోడ్పడతాయి. శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా జరిగేలా చేయడంతోపాటు..క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు రాకుండా నివారించడంలో కూడా సహాయపడతాయి. పుచ్చకాయ వేసవిలో శరీరానికి ఉపశమనం కల్పించేవాటిలో పుచ్చకాయలు కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఇందులో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని తినటం వల్ల డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. కాయను ముక్కలుగా చేసి తినొచ్చు. లేదా డ్రింక్‌గా తయారుచేసుకుని తాగొచ్చు. వేసవిలో దీనిని బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా పిలుస్తుంటారు. బీటా కెరోటిన్, పొటాషియం, ఐరన్ వంటి ఖనిజాలతో పాటు విటమిన్ సి కూడా ఈ పండులో సమృద్ధిగా ఉంటుంది. ఇవన్నీ శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటంలో సహాయపడతాయి.

పచ్చి మామిడి రసం : పచ్చిమామిడిని కూడా ముక్కలుగా కోసి తినొచ్చు. లేదా మిక్సీలో వేసి రసంలా చేసి తాగొచ్చు. ఇది కూడా వేసవి తాపాన్ని తగ్గించేసి శరీరానికి శ క్తి నిస్తుంది. దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉండొచ్చు. టిఫిన్ లేదా భోజనం ఒకవేళ ఆలస్యమైనా రోజంతా అలసట రాకుండా ఉంటుంది. ప్రస్తుతం చిన్నరసాలు, బంగినిపల్లి మామిడిపండ్లు మార్కెట్లోకి కోల్డ్ కాఫీ, టీ: చాలామంది ప్రతిరోజూ కాఫీ తాగుతుంటారు. ప్రతిసారీ హాట్ కాఫీ తాగేబదులుగా ఈ సీజన్‌కు తగ్గట్టుగా కోల్డ్ కాఫీ తాగటం కూడా మంచిదే. మనసు ప్రశాంతంగా హాయిగా ఉంటుంది. టీ కూడా అంతే. చల్లగా కూడా తీసుకోవచ్చు. పాలు లేకుండా డికాషన్‌లో నిమ్మరసం వేసి దానిని చల్లబరిచి తీసుకోవచ్చు. తద్వారా అలసట కూడా తగ్గుతుంది.

మామిడిపండ్లు వేసవిలో లభించే పండ్లలో అతి ముఖ్యమైనవి మామిడి పండ్లు. పెద్ద రసాలు, చిన్నరసాలు రసంతో అందరూ ఎంతో ఇష్టంగా తింటుంటారు. మామిడిలో ఎక్కువగా ఉండే విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. మామిడి పండ్లలో ఎక్కువగా ఉండే ఫైబర్, బీటా కెరోటిన్, విటమిన్ సి వంటి పోషకాలు ఆరోగ్యానికి చాలా అవసరం. ముంతమామిడి, తోతాపురి, హిమాపసంద్ వంటి పచ్చికాయలు కూడా ఆరోగ్యానికి బాగా మేలు చేస్తాయి.

లస్సీ:పెరుగుతో చేసిన లస్సీ కూడా మంచి రీఫ్రెషింగ్ డ్రింక్‌గా చెబుతారు.దీనిని తీసుకోవటం వల్ల శరీరం చల్లబడుతుంది. ఎంత వేడిగా ఉన్నా కాస్త లస్సీ తాగితే చాలా రిలాక్స్‌గా ఉంటుంది.

నిమ్మనీరు : ఎండాకాలంలో తప్పకుండా తాగాల్సిన నీరు నిమ్మరసం. ఈ రసాన్ని నీటిలో పిండి కొద్దిగా ఉప్పు, కొద్దిగా పంచదార వేసి షర్బత్‌లా తీసుకోవచ్చు. చక్కటి ఉపశమనం శరీరానికి వస్తుంది.

## ఎల్లప్పుడూ యంగ్‌గానే కనిపించాలా..?

సినిమాతారలను చూస్తే ఎల్లప్పుడూ వారు యంగ్‌గానే కనిపిస్తారు. 50 సంవత్సరాల వయస్సులోనూ యవ్వనంగానే కనిపిస్తారు. అయితే వారు అలాకనిపించేందుకు ఎంతో కష్టపడతారన్న విషయం మాత్రం చాలా మందికి తెలియదు. వారు సినిమాల్లో నటించాలి కనుక యంగ్‌గా ఉంటేనే బాగుంటుంది. కనుక ఆ ఫిజిక్‌ను మెయింటెయిన్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తుంటారు. వ్యాయామం చేయడంతోపాటు స్ట్రిక్ట్ డైట్‌ను కూడా పాటిస్తుంటారు. అయితే మన శరీరాన్ని యవ్వనంగా ఉంచడంలో ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. మనం తీసుకునే ఆహారాలే మన శరీనాన్ని యవ్వనంగా ఉంచుతాయి. అనారోగ్యాల బారిన పడకుండా చూస్తాయి. ఈ క్రమంలోనే నిత్యం పలు ఆహారాలను తినడం వల్ల ఎల్లప్పుడూ యంగ్ గా ఉండేలా చూసుకోవచ్చు. దీంతో అందరి దృష్టి మీపైనే పడుతుంది. ఇక అందుకు ఏయే ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.


**గ్రీన్ టీ..:** రోజూ 2నుంచి 3 కప్పుల గ్రీన్ టీని సేవిస్తుండడం వల్ల ఎల్లప్పుడూ చర్మాన్ని యవ్వనంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోయేలా చేస్తాయి. దీంతోపాటు తీవ్రమైన వ్యాధులు రాకుండా చూస్తాయి. కనుక గ్రీన్ టీని రోజూ తాగుతుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలగడమే కాకుండా శరీరాన్ని ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంచుకోవచ్చు. చర్మం కాంతివం తంగా మారి మెరుస్తుంది. అలాగే వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు చేపలను ఆహారంలో భాగం చేసుకోవాలి. సాల్మన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, సెలీనియం, ఆస్టాజాం తిన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక చేపలను తరచూ తింటుండాలి.

**డార్క్ చాకొలెట్లు..:** డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా చర్మం ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంటుంది. వీటిల్లో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయి. దీంతో చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. అవిసె గింజలలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజల్లో ఆల్ఫా–లినోలీనిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మం పొరలను సంరక్షిస్తుంది. చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉండేలా చేస్తుంది. దీంతో చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. కనుక అవిసె గింజలను కూడా రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.

**దానిమ్మ పండ్లు..:** చూసేందుకు ఎరుపు రంగులో దానిమ్మ పండ్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవంటే చాలా మందికి ఇష్టమే. అయితే దానిమ్మ పండును రోజూ ఒకటి తింటున్నా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో చర్మ కణాలు పునరుత్తేజం చెందుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. రోజూ దానిమ్మ పండును తినడం ఇష్టం లేకపోతే దాని జ్యూస్‌ను అయినా తాగవచ్చు.దీంతో చర్మాన్నియంగ్‌గాఉంచుకోవచ్చు. అలాగే చెర్రీలను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా చర్మం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది. చెర్రీ పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తింటే చర్మాన్ని ఎల్లప్పుడూ యంగ్‌గా కనిపించేలా చేయవచ్చు.

# మామిడి ఆకులతో

## ఎన్ని వ్యాధులను తగ్గించుకోవచ్చో తెలుసా..?



వేసవి కాలంలో మనకు మామిడి పండ్లు లభిస్తాయి. సీజనల్ ఫ్రూట్ అయిన ఈ పండ్లను వేసవి కాలంలో తింటే అనేక లాభాలను పొందవచ్చు. మామిడి పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవన్నీ మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మామిడి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

గ్యాస్, అజీర్తి, అసిడిటీ, మలబద్ధకం ఉన్నవారు మామిడి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. మామిడి పండ్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. అయితే కేవలం పండ్లేకాదు, మామిడి ఆకులుకూడా మనకుఎన్నోలాభాలను అందిస్తా యి. ఆయుర్వేద ప్రకారంఈ ఆకుల్లో అనేక ఔషధగుణాలుఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేసేందుకు దోహద పడతాయి.

**షుగర్ పూర్తిగా మాయం..:** డయాబెటిస్ ఉన్నవారికి మామిడి ఆకులను ఒక వరంగా చెప్పవచ్చు. 10 నుంచి 15 మామిడి ఆకులను తీసుకుని బాగా కడిగి ఒక పాత్రలోని నీటిలో వాటిని వేసి ఆ నీళ్లను బాగా మరిగించాలి. అనంతరం ఆ నీళ్లను చల్లార్చి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని వడకట్టి పరగడుపునే అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే కొద్ది రోజుల్లోనే ఫలితం కనిపిస్తుంది. షుగర్ లెవల్స్ పూర్తిగా అదుపులో కి వస్తాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే ఇలా నీళ్లను తయారు చేసేసదుపాయం లేనివారు మామిడి ఆకులను నీడలో ఎండబెట్టి పొడిగా చేసి దాన్నినిల్వ చేసుకోవాలి.ఈ పొడినిఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్‌గోరు వెచ్చని నీటిలో కలిపి ఉదయం పరగడుపునే అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాలి. షుగర్ మరీ ఎక్కువగా ఉన్నవారు రాత్రి పూట భోజనానికి ముందు కూడా ఈ నీళ్లను తాగాలి. ఇలా చేస్తున్నా కూడా షుగర్ అదుపులోకి వస్తుంది.

**చర్మ సమస్యలకు..:** మామిడి ఆకులను కొన్ని తీసుకుని నీడలో ఎండబెట్టాలి. ఆ ఆకులను పొడిగా చేయాలి. అనంతరం ఆ పొడిని పెనంపై వేయించి బూడిదలా మార్చాలి. అందులో కాస్త కొబ్బరినూనె కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చాలి. ఈ మిశ్రమాన్ని రాస్తుంటే మొటిమలు తగ్గిపోతాయి. దీన్ని రాత్రి పూట మొటిమలపై రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. దీంతో మొటిమలు తగ్గుతాయి. ఈ మిశ్రమం గాయాలు, పుండ్లు మానేందుకు కూడా పనిచేస్తుంది. మామిడి ఆకులను నీటితో కలిపి మెత్తగా నూరి పేస్ట్‌లా చేయాలి. అందులో కాస్త పెరుగు కలిపి ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా ముఖానికి రాయాలి. 15–20 నిమిషాలు ఆగిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖంపై ఉండే డల్ నెస్ తగ్గుతుంది. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖం అందంగా కనిపిస్తుంది.

**జుట్టు పెరిగేందుకు..:** మామిడి ఆకులను నీటితో కలిపి మెత్తగా నూరి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమంలో కాస్త ఆలివ్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని హెయిర్ ప్యాక్‌లా జుట్టుకు బాగా రాయాలి. 20 నిమిషాలు అయ్యాక తలస్నానం చేయాలి. తరచూ ఈ హెయిర్ ప్యాక్‌ను ఉపయోగిస్తుంటే శిరోజాలు కాంతివంతంగా మారి మెరుస్తాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. చుండ్రు తగ్గిపోతుంది. మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను మీరు స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేయండి. దీంతో చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా దురద నుంచి ఉపశమనం లభిస్తుంది. మామిడి ఆకులను నీటితో కలిపి నూరి మెత్తని పేస్ట్‌లా చేసి అందులో కాస్త కొబ్బరినూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి.

**ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి..:** మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటిలో కాస్త తేనె కలిపి తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభించి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. మామిడి ఆకుల నుంచి రసం తీసి దాన్ని కొద్దిగా వేడి చేయాలి.

ఆ రసాన్ని ఒకటి లేదా రెండు చుక్కల చొప్పున చెవిలో వేయాలి. దీంతో చెవి నొప్పి, చెవి ఇన్ఫెక్షన్ తగ్గుతాయి. మామిడి ఆకులను కాల్చగా వచ్చే పొగను పీలుస్తుంటే వెక్కిళ్లు తగ్గిపోతాయి. గొంతులో గరగర, మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఒక కప్పు మోతాదులో రోజూ తాగుతుంటే బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ మిశ్రమం ఎంతో మేలు చేస్తుంది. ఇలా మామిడి ఆకులతో అనేక చిట్కాలను పాటించి అనేక వ్యాధులను తగ్గించుకోవచ్చు. అయితే అలర్జీలు ఉన్నవారు మామిడి ఆకులను ఉపయోగించకూడదు.

# అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని చూస్తున్నారా..?



ఆరోగ్యంగా ఉండేందుకు మనకు అనేక రకాల డైట్స్ అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ సౌకర్యానికి అనుగుణంగా ఉండే డైట్‌ను పాటిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఒక డైట్ మాత్రం బాగా ట్రెండింగ్‌లో ఉంది. అదే మైండ్ డైట్. రెండు రకాల డైట్‌లను కలిపి ఈ డైట్‌ను రూపొందించారు. మెడిటరేనియన్‌తోపాటు డ్యాష్ డైట్‌ను కలిపి మైండ్ డైట్‌ను రూపొందించారు. రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు ఈ డైట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా పలు ఆహారాలను వారంలో నిర్దిష్టమైన న్నిసార్లు కచ్చితంగా తీసుకోవాలి. అలాగే కొన్ని ఆహారాలను తీసుకోవడం మానేయాలి. లేదా వారంలో చాలా తక్కువ సార్లు తీసుకోవాలి. ఇలా మైండ్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

**ఏం తినాలి..?:** మైండ్ డైట్‌లో బాగంగా వారంలో కనీసం 6 సార్లుకూరగాయలు, ఆకుకూరలను తినాలి, పిండి పదార్థాలు లేని కూరగాయలను ఏదో ఒకటి కచ్చితంగా రోజూ తినాలి. వారంలో కనీసం2 సార్లు బెర్రీలను తినాలి.వారంలో కనీసం 5 సార్లు నట్స్‌ను తీసుకోవాలి. రోజూ ఆలివ్ ఆయిల్‌ను వంటలకు కచ్చితంగా ఉపయోగించాలి. ఓట్ మీల్, బ్రౌన్ రైస్‌ను వారంలో కనీసం 3 సార్లు తినాలి. వారానికి ఒకసారి చేపలను కచ్చితంగా తినాలి. వారంలో 3 సార్లు బీన్స్, వారానికి 2 సార్లు చికెన్ లేదా కోడిగుడ్లను, రోజుకు ఒక గ్లాస్ వైన్‌ను (వీలుంటే) తాగాలి. ఇలా మైండ్ డైట్‌లో భాగంగా ఈ ఆహారాలను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది.

**ఏం తినకూడదు..?:** మైండ్ డైట్‌ను పాటించే వారు మటన్ తినకూడదు. లేదా వారంలో ఒకసారి తినవచ్చు.

అంతకు మించరాదు. వెన్న, నెయ్యి రోజుకు ఒక టీస్పూన్ మించకూడదు. చీజ్‌ను వారంలో ఒకసారి మాత్రమే తినవచ్చు. పేస్ట్రీలు, స్వీట్లను కూడా వారంలో ఒకసారి మాత్రమే తినాలి. వేపుళ్లను కూడా వారంలో ఒకసారి మించి తినకూడదు. ఇక మైండ్ డైట్‌ను పాటిస్తే అనేక లాభాలను పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. మైండ్ డైట్‌ను పాటించడం వల్ల అల్జీమర్స్ వచ్చే రిస్క్ చాలా వరకు తగ్గుతుందని చెబుతున్నారు.

ముఖ్యంగా వయస్సు మీద పడిన వారిలో అల్జీమర్స్ అధికంగా వస్తుంది. కానీ మైండ్ డైట్‌ను పాటిస్తే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. అలాగే మెదడు యాక్టివ్‌గా మారి ఉత్తేజంగా పనిచేస్తుంది. బద్ధకం పోతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. వృద్ధాప్యంలో మతిమరుపు కూడా రాకుండా అడ్డుకోవచ్చు.

**లాభాలు..:** మైండ్ డైట్‌ను పాటిస్తే శరీరానికి అనేక విటమిన్లు, మినరల్స్ లభిస్తాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, కె, బి విటమిన్లు పొందవచ్చు. ఫోలేట్, ఒమెగా 3ఫ్యాటీ యాసిడ్లు అధికంగా లభిస్తాయి. ఇవి మెదడును సంరక్షిస్తాయి. కణాలు వాపులకు గురికాకుండా ఉంటాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది.

క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మైండ్ డైట్ వల్ల హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి. మైండ్ డైట్‌నుపాటిస్తే తీవ్రమైన వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఈ డైట్‌ను పాటించడం అంత తేలికేమీ కాదని, న్యూట్రిషనిస్టులతోపాటు డాక్టర్ సలహాను పాటించి మాత్రమే ఈ డైట్‌ను అనుసరించాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

## తంగేడు పువ్వు ఆరోగ్య ప్రయోజనాలు..!

తంగేడుచెట్లు ఎక్కువగా కొండ ప్రాంతాలలో ఉంటాయి. ఈ చెట్టుకు ఉండే పసుపు రంగు పూలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ చెట్టులో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంచుతాయి. మరిఈ చెట్టును ఏ విధంగా ఉపయోగిస్తే ఆరోగ్యానికి మంచి ఫలితాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. 1.మలబద్ధకం తగ్గుతుంది: తంగేడు ఆకుల పొడిని ఒక గ్లాసు గోరువెచ్చట నీటితో కలిపి ఉదయాన్నే తీసుకుంటే పేగులలో పేరుకుపోయిన మలం తేలికపడి మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. కనుక మలబద్ధక సమస్యలతో బాధపడేవారు తంగేడు ఆకుల కషాయాన్ని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

2.అతిమూత్ర వ్యాధి సమస్యలు తగ్గుతాయి: కొందరిలో మూత్రం అధికంగా పోతుంటుంది. ఈ సమస్యను తగ్గించుకోవడానికి తంగేడుపూలపొడి బెల్లాన్ని సమాన భాగాలుగా తీసుకుని చూర్ణం తయారు చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ప్రతిరోజు సగం స్పూన్ చొప్పున తీసుకుంటే అతిమూత్ర వ్యాధి సమస్యలు తగ్గుతాయి.

3.నీళ్ల విరోచనాలు తగ్గుతాయి:ఒక గిన్నెలో రెండుగ్లాసుల నీళ్లు, తంగేడు చెట్టు వేర్లను వేసి బాగా మరిగించాలి. నీళ్లు బాగా మరిగిన తరువాత స్టవ్ ఆఫ్ చేసుకుని వడగట్టుకుని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. ఇలా ఈ చెట్టు వేర్లతో చేసుకునే కషాయం నీళ్ల విరోచనాలను తగ్గించడానికి చక్కగా పనిచేస్తుంది.

# కర్నూలులో ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీ..!




కర్నూలు,తెలంగాణ దిశ : కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది. ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం. కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది. ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్–బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి. కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి. డ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

# పర్యాటకం పగటి కలేనా?



నిర్మల్: కాశ్మీర్ వెళ్లే పనిలేదు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులను చుట్టి వస్తే చాలు.! అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు పాలకులు ఇస్తున్న హామీలు పగటి కలలుగానే మిగిలిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే సమైక్య ఆంధ్రప్రదేశ్ సహా పక్కనే ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చే పర్యాటక జిల్లాగా పేరు ఉంది. ఉన్న పర్యాటక కేంద్రాలను కాస్త అభివృద్ధి చేస్తే దేశంలోనే గొప్ప పర్యాటక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కీర్తి వస్తుంది. కానీ, పాలకులు ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక ఎన్నికల సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నా అవికార్యరూపం దాల్చడం లేదు. దీంతో ప్రభుత్వాలు, పాలకులపై జిల్లావాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నెన్నో అందాలు...: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల ఖిల్లాగా పేరు ఉంది. 60శాతం పైగా అడవులు విస్తరించి ఉన్న జిల్లా కావడంతోపాటు అనేక జలపాతాలు, సెలయేరులు జిల్లాలో విస్తరించి ఉన్నాయి. దీనికి తోడు అనేక చారిత్రాత్మక ప్రదేశాలు కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉండడం విశేషం. అంతటి మహోన్నత ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దే విషయంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయడంలో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదిమ గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీమ్ జన్మించిన జోడెన్ ఘాట్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆచరణకు నోచుకోలేదు. మ్యూజియం పనులు మినహా ఇతర అభివృద్ధి పనులు జరగడం లేదు. ఆ ప్రాంతానికి ఉట్నూరు లేదా ఆసిఫాబాద్ మీదుగా కెరామెరి ఘాట్స్ మీదుగా వెళ్తే కాశ్మీర్ వెళ్లినట్లే. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు కనువిందు చేస్తాయి. జైనాథ్ సూర్య దేవాలయం, నాగోబా ఆలయం, ఉట్నూర్ గోండుల జిల్లా, సిర్పూర్ పేపర్ మిల్లు, సింగరేణి కోల్ మైన్స్, బాసర అమ్మవారి క్షేత్రం, నిర్మల్ కొయ్య బొమ్మలు, కడెం కవ్వాల్ అభయారణ్యం ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనీసం 20కి పైగా మంచి పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటిని తీర్చిదిదితే కనీసం మూడు నుంచి నాలుగు రోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటకులు గడపడంతోపాటు, మంచి అనుభూతిని పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటకం పడకేస్తున్నది. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి రూ.100కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఉట్టిదేనని తేలిపోయింది.

ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. గతంలో మాదిరిగా కాకుండా తాము కచ్చితంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన 10మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు రాజకీయాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి మంత్రి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి నిధుల మంజూరుకు ఒత్తిడి చేస్తే కచ్చితంగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

హైదరాబాద్, : సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే. బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

**బెంగళూరులో దారుణం**


# వైద్యం పేరుతో యువతిపై డాక్టర్ లైంగిక వేధింపులు

- పరీక్ష పేరుతో అరగంట పాటు నరకం చూపించిన వైద్యుడు
- క్లినిక్ ముందు బాధితురాలి కుటుంబం ఆందోళన
- డాక్టర్‌ను అరెస్ట్ చేసి కస్టడీకి తరలించిన పోలీసులు
- అపార్థం చేసుకున్నారంటూ ఆరోపణలు ఖండించిన నిందితుడు




బెంగళూరు: వైద్యుడి చేతిలో ఓ యువతి లైంగిక వేధింపులకు గురైన దారుణ ఘటన బెంగళూరులో వెలుగుచూసింది. చర్మవ్యా ధికి చికిత్స కోసం తన క్లినిక్‌కు వచ్చిన 21 ఏళ్ల యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై పోలీసులు 56 ఏళ్ల డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు శనివారం సాయంత్రం డాక్టర్ ప్రవీణ్ ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లింది. సాధారణంగా ఆమె తన తండ్రితో కలిసి క్లినిక్‌కు వస్తుంటుంది, కానీ ఆ రోజు ఆయనకు వీలు కాలేదు. యువతి ఒంటరిగా రావడాన్ని అదునుగా తీసుకున్న డాక్టర్ పరీక్ష పేరుతో ఆమెను అరగంట పాటు లైంగికంగా వేధించినట్టు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. చర్మ ఇన్ఫెక్షన్‌ను పరిశీలించే నెపంతో తనను అసభ్యంగా తాకాడని, బలవంతంగా కౌగిలించుకుని చాలాసార్లు ముద్దు పెట్టాడని ఆమె ఆరోపించింది. ఆమె ప్రతిఘటించినా వినకుండా, పరీక్షలో భాగంగా దుస్తులు విప్పమని బలవంతం చేశాడని తెలిపింది. అంతటితో ఆగకుండా, ఇద్దరూ కలిసి హోటల్ రూమ్‌లో గడుపుదామంటూ అసభ్యకరమైన ప్రతిపాదన కూడా చేసినట్టు యువతి పోలీసులకు వివరించింది. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు క్లినిక్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న అశోక్ నగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, డాక్టర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, డాక్టర్ ప్రవీణ్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాను కేవలం వైద్య పరీక్ష మాత్రమే చేశానని, యువతి తన చర్యలను అపార్థం చేసుకుందని వాదించారు. పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్లు 75, 79 కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

# బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# ఆ నాలుగు ప్రాంతాలకు మహర్దశ



**నిజామాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. తెలంగాణలో ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టాల్సిన 4 జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఆర్మూర్– జగిత్యాల, జగిత్యాల–కరీంనగర్, జగిత్యాల– మంచిర్యాల జాతీయ రహదారు లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది. అంతకుముందు మహబూబ్‌నగర్–గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే ఆహ్వానించింది. ఈ నాలుగు రహదారులను ఎన్‌హెచ్‌ఏఐ మొత్తం 271 కి.మీ. మేర రూ. 10,034 కోట్లతో నిర్మించనుందని సమాచారం. ఈ డిసెంబరులో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు చేపట్టనుంది. ఇందులో జగిత్యాల– మంచిర్యాల హైవేని ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగతా మూడింటిని హ్యామ్ విధానంలో వేయనున్నారు. ఈ నాలుగు రహదారులకు పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తే వెంటనే పనులు మొదలవుతాయి. జాతీయ రహదారుల వివరాలు..: మహబూబ్‌నగర్– గూడెబల్లూర్ జాతీయ రహదారి: 80 కి.మీ. మేర రూ. 2,662 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఆర్మూర్– జగిత్యాల జాతీయ రహదారి: 64 కి.మీ. మేర రూ. 2,338 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు 288.3 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. జగిత్యాల– కరీంనగర్: 59 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,484 కోట్లతో నిర్మిస్తారు. ఇందుకు 306.7 హెక్టార్ల భూసేకరణ చేయాలి.

# డెలివరీ బాయ్స్ స్థానంలో డ్రోన్లు..

## గిగ్ వర్కర్స్‌పై ఏఐ పిడుగు!

## లక్షల మంది వీధిన పడే ప్రమాదం




న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు నిపుణులైన ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా సాధారణ ఉద్యోగుల ఉసురు తీసేందుకు సైతం సిద్ధమవుతున్నది. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలలో నిపుణులైన సిబ్బందికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమిస్తున్న ఏఐ.. త్వరలో డెలివరీ బాయ్స్ స్థానాన్ని కూడా ఆక్ర మించనున్నది. అమెజాన్, జెప్టో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలు.. మనం ఆర్డర్ చేసిన వస్తువులను 10 నిమిషాల్లో మన ఇంటి ముందుకు తెస్తున్నాయి. ఇందుకోసం ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను వినియోగిస్తున్నాయి. కాగా.. ఈ డెలివరీ బాయ్స్ స్థానాన్ని త్వరలో డ్రోన్లు ఆక్రమించనున్నాయి. ఇదే జరిగితే ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కొన్ని లక్షల మంది వీధిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే గుర్గావ్, బెంగళూరు వంటి నగరాల్లో వస్తువుల బట్వాడాకు పలు సంస్థలు డ్రోన్లనే వినియోగిస్తున్నాయి. ఉద్యోగులతో పోల్చుకుంటే అత్యంత వేగంగా, అతి తక్కువ ఖర్చుతో డ్రోన్లు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ అమెరికాలోని తన గోదాములలో ఇప్పటికే ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఏఐతో పనిచేసే రోబోలను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ యాంత్రీకరణకు మద్దతునిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత లేదు...: డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారికి ఇప్పటికే ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు, పీఎఫ్ సదుపాయం లేదు. పని మానేసిన రోజున ఎటువంటి బెనిఫి ట్స్ చేతికందవు. రోజుకు12నుంచి 15 గంటలు పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఒక్కరోజు పనికి వెళ్లకపోతే.. ఆ రోజుకు ఎటువంటి భత్యం అందదు. ప్రభుత్వ పథకాలు తెలియవు: దేశంలో కోటిమం దికిపైగా ఉన్న గిగ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని సదుపాయాలను ప్రకటించింది. ఈ–శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సూచి ంచింది. జన్ ఆరోగ్య యోజన సదుపాయాలను కల్పిస్తామని తెలిపింది. అయితే వీటి గురించి చాలామంది గిగ్ వర్కర్లకు తెలియదని గిగ్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త నిర్మల్ గౌరానా చెప్పారు. వారు తమ రోజువారీ ఉపాధిపైనే దృష్టి కేంద్రీకరిస్తారని ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియదని అన్నారు. వారు పనిచేస్తున్న కంపెనీ వారిని రోడ్డున పడేస్తే,పరిహారం అడిగే హక్కు కూడా వారికి లేదని చెప్పారు.

# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిలల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది. ఈ మార్గంలోఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు ప్రణాళికలలు సిద్ధం చేశారు.

# సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యం



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** క్లాసు రూంలో పాఠాలు చెబుతున్న ఆ ప్రొఫెసర్.. ఆ తరగతి పిల్లలకి అధ్యాపకురాలు మాత్రమే కాదు.. వారిలో దాగున్న ఎన్నో ప్రశ్నలకి సమాధానం. సమాజం నుండి ఎంతో వివక్షని ఎదుర్కొన్న తను చెప్పే పాఠాలు ఆ పిల్లల మెదళ్లల్లో సమాజంలో తనలాంటి వాళ్లని చూసే చూపుని మారుస్తుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. క్యాంపస్‌లో ఆమె వేసే ప్రతి అడుగులో చూస్తున్న వారికి, వింటున్న వారికి, గౌరవిస్తున్న వారికి ప్రతి ఒక్కరికీ ఆమె సాధించిన విజయం కనిపిస్తుం ది. ఎందుకంటే ఆ ప్రొఫెసరమ్మ ట్రాన్స్‌జెండర్. తమిళనాడు లయోల కాలేజీలో ఈ ఏడాది జూన్ నుండి అసిస్టెంట్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె పేరు డాక్టర్ ఎన్. జెన్సీ.

తమిళనాడు చరిత్రలో ఉన్నతవిద్యలో అర్హత సాధించిన, ఉన్నత కొలువు దీరిన మొట్టమొదటి ట్రాన్స్.. జెన్సీ. ఒకప్పుడు విద్యాలయం నుండి గెంటివేయబడిన తను ఈరోజు ఆ విద్యాలయంలోనే గౌరవమ ర్యాదలు పొందుతున్న హెూదాలో ఉన్నారు. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పిహెచ్‌డి చేసిన జెన్సీకి అధ్యాపక వృత్తి అంటే ఎనలేని ప్రేమ. పిల్లలని విద్యావంతులని చేసి, సమాజాన్ని చైతన్యం చేయాలన్న లక్ష్యం ఆమెది. విద్య తనలాంటి వారిని ఎంత అందలం ఎక్కిస్తుందో ఆమె నిరూపించ లానుకున్నారు. అందుకే ఎన్నో కష్టనష్టాలు పడి, అవమానాలు ఎదుర్కొని మరీ డాక్టరేట్ సాధించారు. అయితే ఈ విజయం పట్ల ఆమె సంతోషంగా లేరు. ట్రాన్స్ వ్యక్తుల పట్ల సమాజం చూపే వివక్ష పోయినప్పుడే తనకి ఆనందమని ఆమె పదే పదే చెబుతారు. 'ఈ సమాజం ట్రాన్స్ వ్యక్తులని భిన్నంగా చూస్తుంది. ఇంటి నుండి గెంటేయాలని చెబుతుంది. కానీ ట్రాన్స్ వ్యక్తులని చదివించండి' అని ఆమె అంటారు. ప్రొఫెసర్‌గా ఉన్న ఆమె తనలాంటి వారి పట్ల సమాజం దృష్టికోణం మార్పించాలని నిరంతరం శ్రమిస్తున్నారు. టెడ్ స్పీకర్‌గా విద్యాసంస్థలు, సామాజిక వేదికలు, ప్రజా వేదికలలో 50కి పైగా ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చి సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తన కమ్యూనిటీ వ్యక్తులు ఎదుర్కొనే పలు సమస్యలపై కూడా ఆమె పనిచేస్తున్నారు. సాధారణంగా ఏదేని గుర్తింపు పత్రాల్లో లింగనిర్ధారణ ముఖ్యంగా చేస్తారు. అయితే ట్రాన్స్ వ్యక్తులు మొదట ఉన్న గుర్తింపు తరువాతి కాలంలో మార్చుకోవాల్సి వస్తుంది. ఇది అంత సాధారణమైన ప్రక్రియ కాదు. ఎన్నో ఇబ్బందులు పడాలి. జెన్సీ ఆ సమస్యలను పరిష్కరించి కమ్యూనిటీ వ్యక్తులకి సాయం చేస్తున్నారు. అంతేకాదు, సామాజికంగా, విద్యాపరంగా ఎదుర్కొనే సమస్యలపై సలహాలు ఇస్తున్నారు. దీనిపై ఆమె ఇలా అన్నారు. 'ఈ ప్రయాణంలో నేను ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పోరాడాను. నా తరువాత వచ్చేవారికి ఈ సమస్యలు పునరావృతం కాకూడదు. అందుకే సాయం చేస్తున్నాను'. ప్రొఫెసర్‌గా, సామాజిక కార్యకర్తగా రెండు బృహత్తర బాధ్యతల్లో తలమునకలైన జెన్సీ ఈ ప్రయాణంలో ఎంత ముందుకు వెళ్లారంటే.. ఇటీవల పేదపిల్లలకి అవార్డు ప్రదానం చేస్తున్న ఓ జంట, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెన్సీని పిలిచారు. అప్పుడు 'సమాజంలో ఈమార్పు రావాలనే నా ప్రయత్నం. ఇది అన్ని చోట్లా రావాలి' అంటూ ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. సమాజంలో ఇంతటి ప్రభావం చూపిస్తున్న జెన్సీ ఇప్పుడు తన కమ్యూనిటీకే కాదు. ఎంతోమందికి స్ఫూర్తిమంతంగా కనిపిస్తున్నా రు. కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులు తనని పాఠాలు చెప్పే అధ్యాపకు రాలిగానే కాదు, 'అంతకు మించిన వ్యక్తి' అని కొనియాడుతారు. 'ఆమె చూపించే ప్రభావం పాఠాలకి మించి ఉంటుంది' అంటారు. 'ఎన్నో సమస్యల అడ్డుగోడలని బద్దలు చేయగల ఏకైక సాధనం విద్య' అని ఆమె నిరూపించింది అని అభివర్ణిస్తారు.

# రిజిస్ట్రేషన్లతో భారీగా ఆదాయం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక్క డిసెంబర్ నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారి పుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతో పాటు శివారు ప్రాంతా లు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు నమోదైన రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1,390 కోట్లు అధికం. తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది.ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,9 57.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 2022- 23లో రూ.11, 806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు తుడిచిపెట్టుకు పోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 2022-23లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడు రాలేదు.దానికి కారణం భూముల ధరలు తక్కువగా ఉండటం. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు హైదరాబాద్ శివారు, చుట్టు పక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయం పెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. నివాస గృహాలు, విల్లాలు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ల తోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఇటీవల జరిగిన ఖరీదైన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కారణంగా రాబడి గతం కంటే పెరిగి ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలతో కూడిన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నిర్మిస్తుంది. కొత్త సమీకృత రిజిస్ట్రేషన్ ఆఫీసు భవనాల్లో భూముల రిజిస్ట్రేషన్‌తో పాటుగా.. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణులు, పిల్లలు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

# ముద్రగడ దారెటు..?

**కాకినాడ,తెలంగాణ దిశ :** కాపు నాయకుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం నుంచి ఎంతోమంది రాజకీయంగా ఎదిగినా, రిజర్వేషన్ ఉద్యమం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఆయన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ఒకే దిశలో సాగలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉద్యమ నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందినప్పటికీ, కొన్ని సందర్భాల్లో అదే సామాజిక వర్గానికి వ్యతిరేకంగా ఆయన వైఖరి కనిపించిందని రాజకీయ విశ్లేషకులు అంటారు.ఇటీవల జరిగిన 2024 ఎన్నికల్లో ఆయన ఇచ్చిన పిలుపును కాపు వర్గం పెద్దగా పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా జనసేన పార్టీ పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఓటమి కోసం ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఎన్నికల ఫలితాల అనంతరం జగన్మోహన్ రెడ్డిను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పోరాడతానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఆ సమయంలోనే ఆయన అనారోగ్యానికి గురికావడంతో రాజకీయంగా చురుగ్గా ముందుకు సాగలేకపోయారు.ముద్రగడ రాజకీయ జీవితం ప్రారంభ దశలో ఎంపీగా, మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కానీ ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఓడిపోవడం ఆయనను తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. ఆ ఓటమి తరువాత తీసుకున్న కొన్ని నిర్ణయాలు రాజకీయంగా సరైనవి కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం వయసు పెరిగిపోవడం, ఆరోగ్య సమస్యలు ఉండటంతో తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం.ఎన్నికలకు ముందు ఆయన జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. గౌరవం ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధమని ఆయన సంకేతాలు పంపినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదట పవన్



సానుకూలంగా స్పందించినా, ఆ తర్వాత పరిస్థితులు మారడంతో ముద్రగడ మనస్తాపానికి గురయ్యారని అంటారు. అదే సమయంలో ఆయన తాడేపల్లి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఆయనకు గౌరవం లభించినప్పటికీ, పార్టీ భవిష్యత్తుపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో పవన్ ప్రభావం కొనసాగుతుండటం, వైసీపీ బలహీనంగా కనిపించడంతో 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి అవకాశాలు తక్కువేనన్న చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముద్రగడ ఆలోచన మారుతున్నట్టు రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవల టీడీపీకి చెందిన సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తో ఆయన భేటీ కావడం మరింత ఆసక్తిని రేపింది. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని చెప్పినా, దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కుమారుడి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా ముద్రగడ కూటమి పార్టీల వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడుతోంది. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎదురైన నష్టాన్ని సరిదిద్దుకునే ప్రయత్నంగా దీనిని కొందరు భావిస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో నిజం ఎంతుందో, ఆయన తదుపరి అడుగు ఏమిటో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

# మళ్లీ బూతుల సంస్కృతి!

**గుంటూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. రాజకీయాల్లో విమర్శలు సహజం, కానీ ఆ విమర్శలు స్థాయి దాటినప్పుడు అవి పార్టీల మనుగడకే ప్రమాదకరంగా మారుతాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం విమర్శలు, ప్రతివిమర్శలతో కాక, వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర భాషతో కలుషితమవుతోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు నాగరిక సమాజం తలదించుకునేలా ఉన్నాయి. ఒక సీనియర్ నేతగా, మాజీ మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి, ఇలాంటి భాషను వాడటం కేవలం వ్యక్తిగతం కాదు, అది ఆ పార్టీ సంస్కృతినే ప్రతిబింబిస్తోంది.రాజకీయ పార్టీలకు అధికారం ముఖ్యం కావచ్చు, కానీ నైతికత అంతకంటే ముఖ్యం. గతంలో ఐటీడీపీకి చెందిన ఒక కార్యకర్త వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు, టీడీపీ వెంటనే స్పందించింది. అతడిని పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలకు సహకరించి ంది. ఇది ఒక పార్టీకి ఉండాల్సిన బాధ్యతాయుతమైన వైఖరి.కానీ వైసీపీ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించాల్సింది పోయి, పార్టీ శ్రేణులు ఆయన్ను సమర్థిస్తున్నాయి. దీనికి తోడు కులం కార్డును తెరపైకి తెచ్చి, అంబటిపై దాడిని కాపు సామాజికవర్గంపై దాడిలా చిత్రీకరించే ప్రయత్నం చేయడం రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టగానే చూడాలి. తప్పు చేసినప్పుడు వ్యక్తిని తప్పు పట్టాలి తప్ప, దానికి కులాన్ని అంటగట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం పార్టీకి దీర్ఘకాలంలో నష్టమే చేకూరుస్తుంది.గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపి, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడులు చేశారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి ఆ దాడులను సమర్థిస్తూ, "అధినేతను తిడితే కేడర్‌కు బీపీ రావడం సహజం" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే సూత్రాన్ని టీడీపీ కేడర్‌కు వర్తింపజేస్తే వైసీపీ ఎందుకు గగ్గోలు పెడుతోంది? వైసీపీ కేడర్ దాడి చేస్తే అది 'ఆవేశం'. టీడీపీ కేడర్ నిరసన వ్యక్తం చేస్తే అది 'హత్యాయత్నమా?'. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని దూషించినప్పుడు వచ్చే స్పందన కూడా అంతే తీవ్రంగా ఉంటుందని వైసీపీ గ్రహించలేకపోతోంది.2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు కోలుకోలేని దెబ్బ తీశారు. 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోవడానికి ప్రధాన కారణం ఆ పార్టీ నేతల అహంకారం, భాషా శైలేనని రాజకీయ విశ్లేషకులు భావించారు.

అయితే, ఓటమి తర్వాత కూడా వైసీపీ తన ధోరణిని మార్చుకున్నట్లు కనిపించడం లేదు. నేటికీ ఎదురుదాడి, అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలనే ఆయుధాలుగా వాడుతోంది.రాజ కీయ పార్టీ అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం మాత్రమే కాదు, సమాజానికి ఒక దిశానిర్దేశం చేయడం. బూతులు మాట్లాడే నేతలను వెనకేసుకురావడం ద్వారా వైసీపీ తన కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతోంది. అంబటి రాంబాబు వంటి నేతలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఆ పార్టీపై ఉన్న బూతుల పార్టీ అనే ముద్ర మరింత బలపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా వైసీపీ ఆత్మపరిశీలన చేసుకుని, విమర్శలను అర్థవంతంగా చేయడం నేర్చుకోకపోతే ప్రజల నుండి మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది.

# విశాఖలో గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** విశాఖపట్నంఒకప్పుడు ప్రశాంతతకు చిరునామాగా నిలిచేది. సముద్రతీర గాలితో, పచ్చని కొండలతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ఈ నగరం 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయితే కాలక్రమేణా అభివృద్ధి వేగం పెరిగిన కొద్దీ, దానికి అనుసంధానంగా కాలుష్యం కూడా విస్తరించింది. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, అదే ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతుండటంపై మేధావులు, పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా కాలుష్య సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాలుష్య నియంత్రణ విషయంలో ఇక సీరియస్ చర్యలు తప్పవని అధికారులకు ఆయన స్పష్టంగా సూచించారు. చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా, కఠినంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగం, పరిశ్రమలు, ప్రజలు అందరూ కలిసి పనిచేస్తేనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పెరిగినంత వేగంగా కాలుష్యం కూడా పెరిగిపోయిందని పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రసాయన పరిశ్రమల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్న పరిస్థితి ఉందని, పిల్లల్లో చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భస్రావాలు, పెద్దల్లో ఊపిరితిత్తుల సంబంధిత రోగాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇది అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలతో చెలగాటమాడ టమేనని ఆయన వ్యాఖ్యానించారు.విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో బొగ్గు ధూళి వల్ల కాలుష్యం అధికమవుతోందని, దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నా రు. పరిశ్రమలు రావడాన్ని ప్రభుత్వం వ్యతిరేకించడం లేదని, కానీ అవి నిబంధనలు పాటిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పరిశ్రమల్లో తప్పనిసరిగా అమలు చేయాల్సిన 33 శాతం గ్రీన్ బెల్ట్ నిబంధనను కచ్చితంగా పాటించాలన్నారు.

పర్యావరణ అధికారులు కూడా మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, జీవ వైవిధ్యాన్ని కాపాడే విధంగా పని చేయాలని పవన్ సూచించారు. ఇదే సందర్భంలో ఆయన 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది కోస్తా జిల్లాల పరిధిలో సుమారు 970 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని అయిదు కిలోమీటర్ల వెడల్పుతో, మూడు బఫర్ జోన్లుగా అభివృద్ధి చేసి, పచ్చని మొక్కల గోడ నిర్మించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. ఈ ప్రణాళికలో పారిశ్రామికవేత్తలు భాగస్వాముల వ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ గ్రీన్ వాల్ తీర ప్రాంతాన్ని రక్షించడమే కాకుండా, కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారంగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

# అరవ శ్రీధర్ కు నిద్ర లేని రాత్రులు..



**కడప,తెలంగాణ దిశ :** జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో బాధితులు ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. రోజుకొక వీడియోతో ఆయనకు నిద్ర లేకుండా చేస్తోంది. ఓవైపు అధికారికంగా విచారణ సాగుతున్న టైంలోనే ఇలా ఒక్కో వీడియోతో సంచలనం రేపుతోంది. ఆమె డీఫ్‌ఫేక్ వీడియోలతో అసత్య ఆరోపణలు చేస్తుందని ఎమ్మెల్యే వర్గం కవర్ చేస్తుంటే ఆమె మాత్రం తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెబుతోంది. అందుకు తగ్గట్టుగానే వీడియోలు రిలీజ్ చేస్తోంది. తాజాగా అసెంబ్లీ నుంచి బాధితురాలికి వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీడియో వదిలారు బాధితురాలు. తాజాగా బయటపడిన వీడియో వివరాల ప్రకారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అరవ శ్రీధర్ బాధితురాలితో వీడియో చాటింగ్ చేస్తున్నట్టు ఉంది. సభలో ప్రజా సమస్యలు లేవన్నట్టు అసెంబ్లీ ప్రాంగణం నుంచే మహిళకు వీడియో కాల్ చేసి అసభ్యకరమైన రీతిలో మాట్లాడటంపై వైసీపీతోపాటు నార్మల్ నెటిజన్లు ఆన్‌లైన్‌లో విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీ గౌరవ మర్యాదలు కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఉన్న అరవ శ్రీధర్ తనను రేప్ చేసి ఐదు సార్లు అబార్షన్ అయ్యేలా చేశారని బాధితురాలు నాలుగు రోజుల క్రితం మీడియా ముందుకు వచ్చారు. తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని తనను వేధింపులకు దిగారని ఆరోపించారు. దీనిపై పార్టీ పెద్దలకు, ప్రభుత్వ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని అందుకే మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. మీడియాతో మాట్లాడిన ఆమె తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తాను డబ్బుల కోసమే, లేకుండా ఎమ్మెల్యేను పెళ్లి చేసుకోవాలని ఉద్దేశంతో ఇదంతా చేయలేదని, తనకు న్యాయం జరగాలని ఆయనకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. తాను పాతిక కోట్లు డిమాండ్ చేసిందని అబద్దమని చెప్పారు. తన వెనుక వైసీపీ ఉందనే ప్రచారాన్ని కూడా బాధితురాలు ఖండించారు. ఈ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి శ్రీధర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన తప్పు లేదని తనను బ్లాక్ మెయిల్ చేయడానికి సదరు మహిళ డీప్‌ఫేక్ వీడియోలతో పరువు తీస్తున్నారని ఆరోపించారు. కచ్చితంగా మహిళ అసలు రూపం తెలుస్తుందని అన్నారు. ఇంతలో జనసేన పార్టీ కూడా ఈ వివాదంపై స్పందించి విచారణకు కమిటీ వేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విచారణ పూర్తి అయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేకు సూచించారు. అయితే ఈ వివాదం మొదలైనప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటమే కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది రంగంలోకి హ్యూమన్ రైట్స్ కమిషన్: వివాదం దుమారం రేపడంతో జనసేన పార్టీ అంతర్గత విచారణకు ఆదేశించింది. పార్టీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని సమాచారం. ఇప్పటివరకు బయటకు వచ్చిన వీడియోలు, అందులో కనిపిస్తున్న అంశాలు, వాటి నిజానిజాలపై కమిటీ సమగ్రంగా పరిశీలన జరుపుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు ఆరోపణలు చేసిన వీణను కూడా కమిటీ ప్రత్యక్షంగా కలసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి తొలి వారంలో జనసేన అంతర్గత విచారణ కమిటీ రైల్వే కోడూరు ప్రాంతంలో పర్యటించనుందని సమాచారం. అక్కడ స్థానిక స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి ఒక నివేదిక సిద్ధం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నివేదిక ఆధారంగా పార్టీ క్రమశిక్షణ చర్యలు ఏవైనా ఉంటే తీసుకుంటామని స్పష్టంగా తెలియజేశారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే సమాచారం సేకరించారని, పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం మరో కీలక దశకు చేరింది. వీణ తాజాగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను ఆశ్రయించారు. తనపై లైంగిక దాడి జరిగిందని, పెళ్లి హామీతో మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదును ఆమె తరఫున న్యాయవాది ఆజాద్ దాఖలు చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఫిర్యాదును స్వీకరించి విచారణకు అంగీకరించ డంతో ఈ కేసు జాతీయ స్థాయిలోనూ దృష్టిని ఆకర్షిస్తోంది.

# అరకు కాఫీకి సర్కారీ ప్రమోషన్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఏపీ ప్రభుత్వం కాఫీ రైతులకు శుభవార్త వినిపించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ రైతులకు తీపికబురు వినిపించింది. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి, జి. మాడుగుల మండలాల్లో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. గూడెం కొత్తవీధిలో మెషీన్ల సాయంతో భూమిని చదును చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, గూడెం కొత్త వీధి మండలాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎప్పుడో ప్రణాళికలు రచించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రెండుచోట్లా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో పల్పింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.మరోవైపు ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఉపయోగిస్తున్నారు. 80 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. గూడెం కొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం వద్ద భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభించారు. యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నారు. గూడెం కొత్తవీధిలో పల్పింగ్ కేంద్రం రక్షణ గోడ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.మరోవైపు మన్యం ప్రాంతంలో కాఫీ తోటల సాగు ఎక్కువ. మన్యంలో సుమారుగా రెండున్నర లక్షల ఎకరాలలో కాఫీ పంట సాగవుతోంది. కాఫీ తోటలపై ఆధారపడి లక్షకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారుగా రూ.200 కోట్ల వరకూ కాఫీ వ్యాపారం జరుగుతోంది.మరోవైపు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే.ప్రభుత్వం కూడా అరకు కాఫీని ఇదే రీతిలో ప్రమోట్ చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు నిధులు విడుదల చేశారు. దీంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్దేశిత గడువులోగా ఈ పనులు పూర్తిచేస్తామని అధికారులు చెప్తున్నారు.

# అంబటి వ్యాఖ్యలపై చర్చ...



**గుంటూరు,తెలంగాణ దిశ :** వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించ లేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం.వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది.అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు. ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పదవి నుంచి అంబటిని తప్పించడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందనే భావన పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయనపై కేసులు నమోదవడం, పార్టీ నుంచి సరైన సహకారం లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమైందని అంటున్నారు.ఈ అన్ని అంశాల సమ్మేళనమే అంబటి కోపంగా బయటపడడానికి దారితీసిందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ ఘటనతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని, వైసీపీలో అంతర్గత అసంతృప్తి బయటకు వస్తోందనే చర్చ జరుగుతోంది. ఒక్క అంబటే కాకుండా మరికొందరు నాయకులు కూడా ఇదే తరహా ఆగ్రహంతో ఉన్నప్పటికీ, కొందరు సంయమనం పాటిస్తుండగా మరికొందరు బహిరంగంగా స్పందిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామాలు వైసీపీ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# మళ్లీ పడిపోయిన టమాటా ధరలు

**తిరుపతి,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్‌లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు.చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్‌లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్‌కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు.జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్‌గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు



వ్యాపారులు. మార్కెట్‌కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు.రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్‌లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు.

# ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

**గుంటూరు,తెలంగాణ దిశ :** తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అను సంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాల పై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించిం ది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపర చాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ లు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయా లనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు. నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను కూడా క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్‌లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డు అందుకున్న కృష్ణవేణి విద్యార్థిని సాయి స్కంద

**మంథని ,తెలంగాణ దిశ :**సుచిన్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ మ్యాథ్స్ ఒలంపియడ్ పరీక్షలో స్టేట్ 5వ ర్యాంకు సాధించిన మంథని కృష్ణవేణి హైస్కూల్ 5వ తరగతి విద్యార్థి కే.సాయి స్కంద అవార్డు అందుకుంది. హైదరా బాద్ లోని రవీంద్రభారతిలో ఘంటా శ్రీనివాసరావు, చింతమనేని ప్రభాకర్ రావు,సినీ ప్రముఖులు హీరో శ్రీకాంత్,శివాజీ రాజా, సుచీర్ ఇండియా గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ వై కిరణ్‌లు కే.సాయి స్కంద కు అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. అవార్డు పొందిన విద్యార్థిని సాయి స్కంద ను పాఠశాల ప్రిన్సిపాల్



ఏ. శ్రీనివాస్, డైరెక్టర్లు పి. సుదర్శన్ రెడ్డి, జాఫర్ హుస్సేన్,నరేష్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# గేమ్ ఛేంజర్ కాబోతున్న ఎర్త్ కారిడార్

**నెల్లూరు,తెలంగాణ దిశ :** కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఏపీకి గుడ్ న్యూస్ వి నిపించింది. ఏపీతో పాటుగా మరో నాలుగు రాష్ట్రాల లో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏపీలోని కోస్టల్ కారిడార్ వెంట ఉన్న ఖనిజాలు, తీర ప్రాంతం, పోర్టులతో అనుసంధానం.. ఏపీని అరుదైన ఖనిజాల అన్వేషణకు గమ్యస్థానంగా మార్చుతుందంటున్నా రు.2026-27 కేంద్ర బడ్జెట్‌లో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉంది. దీంతో ఏపీ పాలిట గేమ్ ఛేంజర్‌గా రేర్ ఎర్త్ కారిడార్ మారుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరుదైన భూలోహాలు, ఖనిజాల అన్వేషణకు హబ్‌గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం నుంచి విధానపరంగా, ఆర్థికంగా సహకారం లభించే అవకాశాలు ఉండటంతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించగల దని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్టల్ కారిడార్ వెంట ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఖనిజాల అన్వేషణ కోసం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 16 వేల హెక్టార్ల భూమిని కూడా కేటాయించారు. కోస్టల్ కారిడార్ ప్రాంతంలో మోనజైట్, ఇల్మనైట్, రూటైల్, జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అరుదైన రేర్ ఎర్త్ ఆక్సైడ్లు (55?60 శాతం) థోరియం (8-10 శాతం) అధిక సాంద్రతలో ఉన్నాయంటున్నారు. ఇవి అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత కీలకమైన ముడి పదార్థాలుగా చెప్తున్నారు.మరోవైపు ఖనిజాల అన్వేషణకు సంబంధించి ఇప్పటికే ఓ ప్రైవేట్ సంస్థకు టెండర్లు కూడా కేటాయించారు. వేయి హెక్టార్ల వరకూ అనుమతి మంజూరు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు వేల హెక్టార్లలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం అనుమతి కోరుతున్నట్లు రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అనుమతులు పొందిన తర్వాత మిగిలిన 11వేల హెక్టార్లలో కార్యకలాపాలను దశలవారీగా వేగవంతం చేస్తామన్నారు. మరోవైపు ఖనిజాల తవ్వకం, ఎగుమతులు మాత్రమే కాకుండా వాటికి అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం, పోర్టులతో అనుసంధానం, విస్తరిస్తున్న పారిశ్రామిక కారిడార్లు కూడా రేర్ ఎర్త్ కారిడార్‌కు కలిసివస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన ఈ రేర్ ఎర్త్ కారిడార్ ఏపీకి గేమ్ ఛేంజర్‌గా అవకాశం ఉందని చెప్తున్నారు.

# దాడుల- ప్రతి దాడుల సంస్కృతా..

**విజయవాడ,తెలంగాణదిశ:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోగతకొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు-ప్రతిదాడుల" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతజోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్చనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు.ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు. టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్సీపీ "అరెస్టుల కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్‌లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది." అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జోగి రమేశ్ ఇంటిపై దాడి ఘటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పాఠంగా నిలిచిపోనుంది. అధికారంలో ఉన్నాం కదా అని చట్టాన్ని అతిక్రమిస్తే, సొంత ప్రభుత్వం కూడా వెనకేసుకురాదని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. గత ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత ప్రభుత్వ జవాబుదారీతనానికి మధ్య ఉన్న ఈ వ్యత్యాసమే తమను ప్రజల్లో మెరుగ్గా నిలబెడుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఎన్నికల హామీలే కాకుండా, పరిపాలనలో, శాంతిభద్రతల నిర్వహణలో ఇటువంటి కఠిన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకం

### 15 ఏళ్లుగా కలిసి పని చేయాలని అనుకుంటున్నాం..

# కథ విన్న వెంటనే ఆశ్చర్యపోయానన్న మహేష్



సూపర్ స్టార్ మహేష్ బాబు-దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి దేశవ్యాప్తంగా చర్చ నడుస్తుండగా, తాజాగా మహేష్ బాబు ఇచ్చిన ఇంటర్వ్యూ మరింత ఆసక్తిని రేకెత్తించింది. సుమారు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. హాలీవుడ్ మార్కెట్‌ను కూడా లక్ష్యంగా పెట్టుకుని ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని రాజమౌళి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందిన రాజమౌళి, ఈ సినిమాను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్లాలని భావిస్తున్నారు.


ఇటీవల 'వారణాసి' గ్లింప్స్ విడుదల సమయంలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతో కలిసి రాజమౌళి హాలీవుడ్‌లో ప్రత్యేక ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూల్లో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా కథ ఎలా ప్రారంభమైందన్న అంశంపై మహేష్ బాబు చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మహేష్ బాబు మాట్లాడుతూ, "ఇంతకుముందు రాజమౌళి గారు నాతో ఎప్పుడూ కథ గురించి చర్చించలేదు. దాదాపు 15 ఏళ్లుగా మేమిద్దరం కలిసి పనిచేయాలని అనుకుంటున్నాం. 'ఆర్ఆర్ఆర్' తర్వాత కూడా దాదాపు ఒక సంవత్సరం పాటు ఆయన నుంచి ఎలాంటి స్టోరీ డిస్కషన్ జరగలేదు. ఆ తర్వాత ఒకరోజు తన ఆఫీస్‌కు పిలిచి ఈ కథను నేరేట్ చేశారు. ఆ కథ విన్న వెంటనే నేను ఆశ్చర్యపోయాను" అని తెలిపారు. ఈ సినిమాలో యాక్షన్, అడ్వెంచర్, మైథాలజీ, టైమ్ ట్రావెల్ వంటి విభిన్న అంశాలు మిళితమై ఉంటాయని మహేష్ వెల్లడించారు. "రాజమౌళి గారికి నేను పెద్ద అభిమాని. ఆయన దర్శకత్వంలో ఇలాంటి విభిన్నమైన కథలో నటించడం నాకు చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రాసెస్‌లో నన్ను పూర్తిగా ఇన్‌వాల్వ్ చేయడం మరింత ప్రత్యేకం" అని చెప్పారు. ఈ వ్యాఖ్యలు సినిమా మీద ఉన్న అంచనాలను మరింత పెంచాయి. అత్యాధునిక టెక్నాలజీ, విజువల్ ఎఫెక్ట్స్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తున్న 'వారణాసి' గ్లోబల్ బాక్సాఫీస్‌ను లక్ష్యంగా పెట్టుకుని రూపొందుతుండటంతో, ఈ సినిమా భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.




### క్లాసిక్ దర్శకుడితో దేవరకొండ

# కొత్త ప్రయాణం..!

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. తాజాగా ఆయన లైనప్‌లోకి మరో ఆసక్తికరమైన పేరు వచ్చి చేరింది. తొలి చిత్రం -హాయ్ నాన్న-తోనే విమర్శకుల ప్రశంసలు అందుకుని, బాక్సాఫీస్ వద్ద క్లాసిక్ హిట్‌ను నమోదు చేసిన యువ దర్శకుడు శౌర్యువ్. తాజాగా ఇప్పుడాయన విజయ్ దేవరకొండకు ఓ అద్భుతమైన కథను వినిపించినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా సెట్ అయిందనే వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. శౌర్యువ్ మొదటి సినిమా -హాయ్ నాన్న-లో చూపించిన ఎమోషనల్ డెప్త్, టేకింగ్ అందరినీ ఆశ్చర్యపరిచింది. తండ్రి-కూతుళ్ల అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించి తానో క్లాసిక్ డైరెక్టర్ అని నిరూపించుకున్నారు. తాజాగా విజయ్ దేవరకొండ వంటి మాస్ - యూత్ ఫాలోయింగ్ ఉన్న హీరోని ఆయన ఏ విధంగా చూపిస్తారనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. వీరిద్దరి కలయికలో వచ్చే సినిమా కచ్చితంగా ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా ఒక వినూత్నమైన కాన్సెప్ట్‌తో కూడిన ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. విజయ్ దేవరకొండ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా ఉంటూనే శౌర్యువ్ మార్క్ సున్నితమైన భావోద్వేగాలు ఈ కథలో



ప్రధాన ఆకర్షణగా నిలవను న్నాయి. ఇప్పటికే కథా చర్చలు ముగిశాయని విజయ్ ఈ స్క్రిప్ట్ పట్ల చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ విజయ్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రంగా నిలిచిపోవడం ఖాయం. ప్రస్తుతం విజయ్ దేవరకొండ రాహుల్ సాంకృత్యన్, రవి కిరణ్ కోలా వంటి టాలెంటెడ్ దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. వాటి తర్వాత శౌర్యువ్ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఒకవైపు మాస్ సినిమాలు చేస్తూనే మరోవైపు శౌర్యువ్ లాంటి దర్శకులతో క్లాసిక్ సినిమాలకు ప్రాధాన్యత ఇవ్వడం విజయ్ మారుతున్న ఆలోచనా విధానానికి నిదర్శనం. ఈ చిత్రం ద్వారా విజయ్ మళ్ళీ తనలోని ఎమోషనల్ యాక్టర్‌ను వెలికితీసే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్టును ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించడానికి సిద్ధంగా ఉందిట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించినఅధికారిక ప్రకటన వెలువడనుంది. -హాయ్ నాన్న- తర్వాత శౌర్యువ్ చేస్తున్న రెండో సినిమా కావడంతో ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజయ్ దేవరకొండ అభిమానులు కూడా తమ హీరో నుండి ఒక హార్ట్ టచింగ్ మూవీ వస్తుందని ఆశిస్తున్నారు. ఈ కాంబో అనౌన్స్‌మెంట్ కోసం సోషల్ మీడియాలో రౌడీ ఫ్యాన్స్ అప్పుడే సందడి మొదలుపెట్టారు.

# సెక్సీ డ్రెస్ లో రమ్మన్నారు...



అందంతో మాత్రమే కాదు, టాలెంట్ తో కూడా ఇండస్ట్రీ లో మంచి అవకాశాలను సంపాదించొచ్చు అని నిరూపించిన హీరోయిన్స్ లో ఒకరు ఐశ్వర్య రాజేష్ ప్రముఖ సీనియర్ హీరో రాజేష్ కుమార్తె గా ఈమె ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టింది. లేడీ కమెడియన్ శ్రీలక్ష్మి స్వయంగా ఈమెకు మేనత్త. తమిళం లో ఎక్కువగా సినిమాలు చేస్తూ వచ్చిన ఐశ్వర్య రాజేష్, అక్కడ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని ఏర్పాటు చేసుకుంది. తెలుగు లో ఈమె 'కౌసల్య కృష్ణమూర్తి' అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్ హీరో గా నటించిన 'రిపబ్లిక్' లో హీరోయిన్ గా చేసింది. నాని 'టక్ జగదీశ్' చిత్రం లో ఈమె సెకండ్ హీరోయిన్ గా చేసింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, టాలీవుడ్ లో ఆమె కెరీర్ ని పూర్తిగా మలుపు తిప్పిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'.గత ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా కమర్షియల్ గా సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ గా నిల్చింది. ఇందులో ఐశ్వర్య రాజేష్ నటనకు కూడా మంచి మార్కులు పడ్డాయి. ఇదంతా పక్కన పెడితే రీసెంట్ గా ఈమె ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ లో తన జీవితం లో ఎదురైనా కొన్న సంఘటనల గురించి చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ 'నేను కెరీర్ ప్రారంభ దశలో ఒక సినిమా కోసం ఆడిషన్స్ కి వెళ్లాను. ఆ చిత్ర డైరెక్టర్ నన్ను సెక్సీ నైట్ డ్రెస్ లో కనిపించమని అన్నాడు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఆడిషన్స్ ఇవ్వకుండానే తిరిగి వచ్చేశాను. నా శరీరం కనిపించాలని అన్నాడు, ఆ సమయం లో నాకు చాలా కోపం వచ్చేసింది. నన్నే కాదు, ఇలా అతను గతం లో ఎంతమంది హీరోయిన్స్ ని అడిగి ఉంటాడో మీరే ఊహించుకోండి. నా సంఘటనని ఎప్పటికీ మర్చిపోలేను' అంటూ చెప్పుకొచ్చింది ఐశ్వర్య రాజేష్.ఐశ్వర్య రాజేష్ అందరి హీరోయిన్స్ లాగా హాట్ డ్రెస్ లో గ్లామర్ గా కనిపించగలదు, కానీ ఇప్పటి వరకు సినిమాల్లో అలాంటి పాత్రల్లో కనిపించలేదు. సంస్కార పక్షమైన దుస్తుల్లోనే కనిపించింది. ఇలాంటి వాళ్లకు కెరీర్ ఉండదని అందరూ అంటుంటారు. కానీ ఐశ్వర్య రాజేష్ తనకంటూ కొన్ని సిద్ధాంతాలను పెట్టుకొని, ఆ దిశగానే తన కెరీర్ ని సాగిస్తూ ముందుకెళ్తోంది. ఈ కాలం లో ఇండస్ట్రీ లో ఇలాంటి హీరోయిన్స్ దొరకడం చాలా అరుదు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# ట్రెడిషనల్ లుక్ లో త్రిష..





తెలుగు, తమిళ్ భాషల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న అతి కొద్దిమంది నటీమణులలో త్రిష గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలకు పైగానే అవుతున్నా .. ఇప్పటికీ చెరగని అందంతో.. వరుస ఆఫర్లతో బిజీగా మారింది. ఇక అలాంటి ఈమె ఈ మధ్యకాలంలో స్టార్ సీనియర్ హీరోల చిత్రాలలో అవకాశాలు అందుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యంగా నయనతారతో అప్పటికీ ఇప్పటికీ పోటీ పడుతోంది. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న విశ్వంభర సినిమాలో హీరోయిన్గా నటించిన త్రిష.. ఈ ఏడాది సమ్మర్ కానుకగా ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉండగా మరొకవైపు కోలీవుడ్ హీరో విజయ్ తో రిలేషన్ లో ఉందనే వార్తలను విపరీతంగా ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఈ విషయంపై అటు కోలీవుడ్ దర్శక నిర్మాతలతో పాటు పలువురు నటులు కూడా వీరి బంధం పై కామెంట్లు చేస్తున్నారు. రాజకీయ నాయకులు కూడా ఈ విషయంలో తలదూర్చడంతో అటు విజయ్ ను రాజకీయంగా తొక్కేయడానికి త్రిషను అడ్డం పెట్టుకొని కామెంట్లు చేస్తున్నారు అనే వార్తలు తమిళ తంబీల నుంచి కూడా వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా త్రిష - విజయ్ మధ్య స్నేహబంధం ఉన్నప్పటికీ ఏదో ఉందనే రూమర్స్ క్రియేట్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

దీనికి తోడు సోషల్ మీడియాలో ఎన్ని రూమర్స్ వస్తున్న సమయంలో త్రిష - విజయ్ ఇద్దరు కలిసి ఇటీవల ఒక పెళ్లి వేడుకలు మళ్లీ జంటగా కనిపించి రూమర్లకు మరింత ఆజ్యం పోశారు. అలా ఈ మధ్య వ్యక్తిగతంగా మరిన్ని విమర్శలు ఎదుర్కొంటుంది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికి అయితే అనవసరపు మాటలను పట్టించుకోవడం అంటే సమయాన్ని వృధా చేసినట్టే అని త్రిష భావించినట్టు ఉంది. అందుకే కాబోలు ఇలా తన పని తాను చేసుకుంటూ మరింత సంతోషంగా గడుపుతోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు

పట్టుచీరలో సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న త్రిష..

ఇకపోతే ఎన్ని విమర్శలు వచ్చినా తనకేమీ పట్టనట్టు సోషల్ మీడియాలో బిజీగా మారిపోయింది. అందులో భాగంగానే ట్రెడిషనల్ లుక్ లో కనిపించి అభిమానుల హృదయాలు దోచుకుంది ఒక జ్యూవెలరీ సంస్థ ప్రమోషన్ లో భాగంగా అందమైన జ్యూవెలరీని ధరించి పట్టుచీరలో సాంప్రదాయంగా మరింత మెరిసిపోయింది ఈ చెన్నై చిన్నది. కాటుక కళ్ళతో మైమరిపిస్తూ త్రిష తాజాగా షేర్ చేసిన ఈ ఇన్స్టాగ్రామ్ ఫోటోలు మరింత వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతూ 40 దాటినా అందానికి కొదవలేదు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇక్కడ విశేషమేమిటంటే.. ముఖ్యంగా వ్యక్తిగతంగా ఎన్ని ఎఫైర్ రూమర్స్ ఎదుర్కొంటున్నప్పటికీ తాజాగా షేర్ చేసిన ఫోటోలలో త్రిష చాలా సంతోషంగా కనిపించడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మిస్ బ్యూటిఫుల్ స్మైల్ నుంచి స్టార్ హీరోయిన్ గా..

త్రిష కెరియర్ విషయానికి వస్తే.. ప్రశాంత్ - సిమ్రాన్ కాంబినేషన్లో వచ్చిన జోడి సినిమాలో సిమ్రాన్ స్నేహితురాలి పాత్రలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్ర ద్వారా కెరియర్ మొదలుపెట్టిన త్రిష.. తెలుగులో తొలిసారి ప్రభాస్ హీరోగా వచ్చిన వర్షం సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో, నటనతో మెప్పించిన త్రిష.. ఆ తర్వాత ఎన్నో చిత్రాలలో నటించి స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకుంది . ఇండస్ట్రీలోకి రాకముందు అందాల పోటీలలో కూడా పాల్గొన్న ఈమె మిస్ చెన్నైగా ఎంపిక అయింది. ఆ తర్వాత మిస్ ఇండియా అందాల పోటీలలో కూడా పాల్గొనింది. పైగా మిస్ బ్యూటిఫుల్ స్మైల్ గా కిరీటాన్ని సొంతం చేసుకుంది త్రిష.

# అల్లు అర్జున్-అట్లీ సినిమాలో నటించడంపై స్పందించిన మృణాల్..

టాలీవుడ్‌లో 'సీతారామంc సినిమాతో కుర్రాళ్ల మనసు దోచుకున్న మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కేవలం సినిమాలు మాత్రమే కాదు, మ్యూజిక్ వీడియోలతో కూడా ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ లో వచ్చిన 'భీగి భీగి' పాటలో మృణాల్ నటించింది. విశేషం ఏంటంటే, ఇందులో తన ఫేవరెట్ కో-స్టార్ దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఆమె మరోసారి (స్కీన్ షేర్ చేసుకుంది. అయితే, ఈ పాట ప్రమోషన్ల సమయంలో మృణాల్ తనపై వస్తున్న ఒక ఆసక్తికరమైన రూమర్‌పై స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న క్రేజీ ప్రాజెక్ట్ లో మృణాల్ ఠాకూర్ ఒక కీలక పాత్ర పోషిస్తోందని, ఇప్పటికే షూటింగ్‌లో కూడా పాల్గొందని ప్రచారం జరుగుతోంది. గత కొద్ది రోజులుగా ఈ వార్త సోషల్ మీడియాలో ఒక వార్త తెగ వైరల్ అవుతోంది. తాజాగా, దీనిపై మృణాల్‌ను ప్రశ్నించగా.. ఆమె తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చింది. "అవునా? నిజంగానే నాకా ఛాన్స్ వచ్చిందా? అయితే ఖచ్చితంగా నా కోసం ప్రార్థించండి. ఒకవేళ అది నిజమైతే మాత్రం మనమందరం కలిసి పెద్ద సెలబ్రేషన్ చేసుకుందాం" అంటూ నవ్వుతూ సమాధానమిచ్చింది. మృణాల్ మాటలను బట్టి చూస్తుంటే ప్రస్తుతానికి అల్లు అర్జున్ సినిమాలో ఆమె నటించడం లేదని, అవన్నీ కేవలం రూమర్స్ మాత్రమేనని అర్థమవుతోంది. అది తనకు చాలా సంతోషాన్నిస్తుందని తన మనసులోని కోరికను బయటపెట్టింది. ఇక మృణాల్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం హిందీలో 'దో దివానే షెహర్ మే', 'డెకాయిట్' వంటిచిత్రాలతో ఫుల్ బిజీగా ఉంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215